మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 14-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 105 Issue: 105

Published from Jagitial
www.evarthalu.com

14 అక్టోబర్ 2025 - మంగళవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు ఆశ్వయుజ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:12 సూర్యాస్తమయం - సా. 5:51 తిథిః అష్టమి ఉ. 11:13 వరకు తరువాత నవమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం పునర్వసు ఉ. 11:55 వరకు తరువాత పుష్యమి యోగం సిద్ధ తె. 4:050 వరకు కరణం కౌలవ ఉ. 11:13 వరకు తైతుల రా. 10:51 వరకు వర్జ్యం రా. 7:56 నుండి రా. 9:32 వరకు దుర్ముహూర్తం ఉ. 8:32 నుండి ఉ. 9:19 వరకు రా. 10:48 నుండి రా. 11:37 వరకు రాహుకాలం మ. 2:56 నుండి సా. 4:24 వరకు యమగండం ఉ. 9:07 నుండి ఉ. 10:34 వరకు గుళికాకాలం మ. 12:02 నుండి మ. 1:29 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:36 నుండి తె. 5:24 వరకు అమృత ఘడియలు ఉ. 9:33 నుండి ఉ. 11:06 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:38 నుండి మ. 12:25 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

# 100% పీఎఫ్ విత్‌డ్రా




కోట్ల మంది ఉద్యోగులకు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) శుభవార్త చెప్పింది. పీఎఫ్ అకౌంట్స్ నుంచి డబ్బు విత్‌డ్రా నిబంధనలను చాలా ఈజీగా చేస్తూ ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ కీలక నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. దీని వల్ల దాదాపు ఏడు కోట్లకు పైగా ఉన్న పీఎఫ్ ఖాతాదారులకు పెద్ద ప్రయోజనం చేకూరనుంది.

న్యూఢిల్లీ: పీఎఫ్ ఖాతాదారులు ఇకపై ఉద్యోగి, యజమాని వాటా సహా పీఎఫ్ అకౌంట్‌లో ఉన్న విత్‌డ్రా చేసుకోదగిన బ్యాలెన్స్‌లో 100 శాతం మొత్తాన్నిత తీసుకోవచ్చు. ఇది పీఎఫ్ వినియో గదారులకు అతి పెద్ద ఊరట అని చెప్పొచ్చు. పాక్షిక విత్‌డ్రాకు సంబం ధించిన గతంలో ఉన్న 13 సంక్లిష్ట మైన నిబంధనలను సీబీటీ రద్దు చేసి, వాటిని కేవలం ఒకే నిబంధన గా మార్చింది. ఈ కొత్త రూల్‌ను మూడు రకాలుగా విభజించారు: ముఖ్యమైన అవసరాలు, 2 వ పేజీలో...



# బంగారం మూటలు

## ఆల్‌టైం హైకి చేరిన పసిడి

### 10 గ్రాముల ధర రూ.1.25 లక్షలు

హైదరాబాద్: బంగారం ధరలు కొనుగోలుదారులకు చుక్కలు చూపిస్తూ సరికొత్త గరిష్ఠాలకు చేరుకున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.లక్షా 25 వేల మైలురాయిని దాటి ఆల్-టైమ్ రికార్డు సృష్టించింది. గత పది రోజులుగా పెరుగుతూ వస్తున్న పసిడి ధర, సోమవారం కూడా అదే జోరును కొనసాగించింది. బులియన్ మార్కెట్ వివరాల ప్రకారం, సోమవారం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ. 320 పెరిగి, తుది ధర రూ. 1,25,400కు చేరింది. అదేవిధంగా, 22 క్యారెట్ల పసిడిపై రూ. 300 పెరగడంతో దాని ధర రూ. 1,14,950గా నమోదైంది. బంగారం ధర తరువాయి 2 వ పేజీలో...



# వెండి కోటలు

## తెలుగు రాష్ట్రాల్లో వెండి ధర రూ.1,97,000

హైదరాబాద్: బంగారంతోపాటు వెండి ధర కూడా భారీగా పెరిగింది. సోమవారం ఒక్క రోజే కిలో వెండిపై ఏకంగా రూ.7,000 పెరగడంతో, తెలుగు రాష్ట్రాల్లో దాని ధర రూ.1,97,000కు చేరింది. పండుగలు, శుభకార్యాలతో సంబంధం లేకుండా ధరలు వరుసగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుత మార్కెట్ సరళిని బట్టి చూస్తే, సమీప భవిష్యత్తులో వెండి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వెండి ప్రజలు, పరిశ్రమలు, కేంద్ర బ్యాంకుల మొదటి ఎంపికగా మారింది. నిరంతరం పెరుగుతున్న కొనుగోళ్ల కారణంగా భారతదేశంలో దీని ధర రూ.1,97,000కు తరువాయి 2 వ పేజీలో...

# రాజగోపాల్ రాజ్యం!

## మునుగోడులో లిక్కర్ షాపులకు సొంతంగా రూల్స్



### వైన్ షాపులు ఊరిబయటే ఉండాలి.. సిట్టింగ్ కుదరదు

### బెల్ట్ షాపులకు మద్యం అమ్మకూడదు, సిండికేట్ ఉండొద్దు

### సాయంత్రం 4 గంటల నుంచి 9 గంటల వరకే అమ్మకాలు

### మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి బహిరంగ ప్రకటన

మునుగోడు నియోజకవర్గాన్ని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంత సామ్రాజ్యంగా ప్రకటించుకున్నారు. రాష్ట్రం మొత్తం అమలు చేసే నిర్ణయాలు తన వద్ద చెల్లవని స్పష్టం చేశారు. మునుగోడుకు కొత్త రూల్స్ సెట్ చేస్తూ బహిరంగ ప్రకటన కూడా చేశారు. ఇప్పటికే మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇలా దరఖాస్తులు చేసే వారందరికీ రాజగోపాల్ రెడ్డి తన సందేశం పంపించారు.

మునుగోడు, అక్టోబర్ 13 (ఈవార్తలు): నియోజకవర్గంలోని మునుగోడు, చండూరు, గట్టుప్పల్, నాంపల్లి, మర్రిగూడ, నాంపల్లి, చౌటుప్పల్, సంస్థన్ నారాయణపురం మండలాలలో వైన్ షాప్స్ టెండర్స్ వేసే ఆశావహులు టెండర్లు వేయాలంటే షరతులు పాటించాలని హుకుం జారీ చేశారు. షరతులు పాటించని వారు టెండర్స్ వేయవద్దని తేల్చి చెప్పారు. వైన్ షాపులు ఊరి బయటే ఉండాలని.. సిట్టింగ్ నడపకూడదన్నారు. బెల్ట్ షాపులకు మద్యం అమ్మకూడదు, సిండికేట్ ఉండొద్దని స్పష్టం చేశారు. మండలానికి చెందిన స్థానికులు మాత్రమే టెండర్లు వేయాలని, ఇతర మండలానికి చెందిన వ్యక్తులు టెండర్లు వేయవద్దని స్పష్టం చేశారు. అదే సమయంలో సాయంత్రం 4:00 గంటల నుండి రాత్రి 9:00 గంటల వరకే మద్యాన్ని విక్రయించాలని తరువాయి 2 వ పేజీలో...



# ఎల్ఈడీ స్క్రీన్లలో రాజన్న దర్శనం

### భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు

### అర్చకుల సూచనలతో నిర్ణయం

### జనవరి 2026 వరకు తాత్కాలిక దర్శనమే

### ఆలయం బంద్ అవాస్తవం : ఆది శ్రీనివాస్

వేములవాడ, అక్టోబర్ 13 (ఈవార్తలు): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనుల నేపథ్యంలో స్వామి దర్శనాన్ని ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ నిర్ణయించింది. అర్చకుల సూచన మేరకు ఆలయ ప్రాంగణంలో స్క్రీన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. ఆలయ నిర్మాణం పూర్తయ్యే వరకు ఈ సౌకర్యం కొనసాగుతుందని తెలిపారు. దేవాదాయ -2 వ పేజీలో...



రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాల్లో అత్యవసర పనుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రాష్ట్ర ప్రభుత్వం రూ.60 కోట్లు కేటాయించింది. ఈ నిధులను డైట్ ఛార్జీలు, తాత్కాలిక సిబ్బంది జీతాల విడుదల, మోటార్ల మరమ్మతులు, ఇతర అత్యవసర పనులకు వినియోగించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయా శాఖల సీనియర్ అధికారులకు చెక్కులను అందజేశారు.

# హాస్టళ్లకు ₹60 కోట్లు

### సీఎంఆర్ఎఫ్ నుంచి కేటాయింపు.. డైట్ చార్జీలు, ఇతరత్రా వినియోగం

### సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం.. సంక్షేమ వసతి గృహాలపై సమీక్ష

### విద్యార్థుల, సిబ్బంది హాజరుకు.. ఫేషియల్ రికగ్నిషన్ అమలుకు ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 13 (ఈవార్తలు): సోమవారం ఐసీసీసీలో సంక్షేమ వసతి గృహాలు, విద్యా సంస్థలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టళ్ల నిర్వహణలో పూర్తి జవాబుదారీతనం ఉండాలని స్పష్టం చేస్తూ, విద్యార్థులు, సిబ్బంది హాజరు కోసం ఫేసియల్ రికగ్నిషన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, సరైన పోషకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అటు.. హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను సీఎం ఆదేశించా రు. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది హాజరును పర్యవేక్షించడానికి ముఖ గుర్తింపు సాంకేతికతను అమలు చేయాలని సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతను తెలుసుకోవడానికి, -2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,540 |
| వెండి (గ్రాము): | రూ.197 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,641 |

## విశ్వవాణి



అంధత్వాన్ని నివారించేలా బంగారం ఇంజెక్షన్లను అభివృద్ధి చేశారు శాస్త్రవేత్తలు. బంగారు నానోపార్టికల్స్‌తో కూడిన ఇంజెక్షన్లను కంటిలోకి జొప్పించి కంటి చూపును తిరిగి తేపించొచ్చు అని బ్రౌన్ యూనివర్సిటీ పరిశోధకులు చెప్తున్నారు.



# జూబ్లీహిల్స్‌లో ఓట్ల చోరీ

### ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫిర్యాదు

### వెంటనే పూర్తిస్థాయి విచారణ జరగాలని వినతి

### కుమ్మక్కైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

2

# నామినేషన్లు షురూ

### తొలి రోజు 10 మంది నామినేషన్

2



# ఓట్ చోరీ ఏంది వయ్యా?

### రాజకీయ అంశాలు కోర్టులకా?

### సిట్ విచారణ లేదు.. ఏం లేదు

### పిటిషనర్‌కు సుప్రీం కోర్టు చురకలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన 'ఓటు చోరీ' ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణ జరిపించాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. ఇది రాజకీయ స్వభావం ఉన్న అంశమని, దీని కోసం న్యాయస్థానాలను వేదిక చేసుకోరాదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చిలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) కొట్టివేసింది. ఇటీవల రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర'లో మాట్లాడుతూ బీజేపీ, కేంద్ర ఎన్నికల సంఘంపై తీవ్ర విమర్శలు చేశారు. 'ఓటు చోర్ – గద్దీ ఛోడ్' అనే నినాదంతో, కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతోనే అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లో బీజేపీ, ఈసీ కలిసి ఓట్లు దొంగిలించాయని, త్వరలో జరగనున్న బీహార్ ఎన్నికల్లో కూడా ఇదే పునరావృతం చేయడానికి తరువాయి 2 వ పేజీలో...

TATA CONSULTANCY SERVICES

# హెచ్1బీలు మాకొద్దు

### అమెరికాలో సరిపడా ఉన్నారు... టీసీఎస్ కీలక ప్రకటన

న్యూఢిల్లీ/న్యూయార్క్: డొనాల్డ్ ట్రంప్ హెచ్-1బీ వీసా అప్లికేషన్ ఫీజును 1 లక్ష డాలర్లకు పెంచిన నేపథ్యంలో టీసీఎస్ కీలక ప్రకటన చేసింది. ఈ సంవత్సరం హెచ్1బీ వీసాల పరిధిలోకి వచ్చే కొత్త నియామకాలు జరపబోమని సంస్థ సీఈవో కృతి వాసన్ తెలిపారు. ఒక ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీనిపై స్పందించారు. ప్రస్తుతం అమెరికాలో తమకు సరిపడినంత మంది హెచ్1బీ వీసా ఉద్యోగులు ఉన్నారని చెప్పారు. అమెరికాలో తమ కంపెనీ సిబ్బంది 33 వేల వరకు ఉండగా.. దాదాపు 11 వేల తరువాయి 2 వ పేజీలో...



2

# ఆర్థికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

### ఆర్థిక వృద్ధి ఆవిష్కరణకు పురస్కారం

# సీజీహెచ్ఎస్ ధరల్లో మార్పు



### కేంద్ర ఉద్యోగులకు కేంద్రం బొనాంజా

### 15 ఏళ్ల తర్వాత ప్యాకేజీ రేట్ల సవరణ

### 2000 రకాల వైద్య సేవలు, చికిత్సల ధరల్లో మార్పులు

### వెంటనే అమల్లోకి వచ్చిన కొత్త రేట్లు

2



# రాశి ఫలాలు

14.10.2025

మేషం: పెద్దల ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం. .దూర ప్రాంతాల సన్నిహితుల నుంచి విలువైన సమాచారం అందుతుంది. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ఇంటాబయట మీ మాటకు విలువ పెరుగుతుంది. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు.

వృషభం: నిరుద్యోగులకు అనుకోని విధంగా లభించిన అవకాశాలను సద్వినియోగం చేయనుకోవాలి. మిత్రుల సహాయంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. మానసికం గా ప్రశాంతత కలుగుతుంది. ఇతరుల వ్యవహారాలకు దూరంగా ఉ ఒడటం మంచిది. రుణ ఒత్తిడి నుండి బయటపడతారు.

మిధునం: అన్నిరంగాల వారికి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉ ఒటుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో విబేధాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమవుతుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించాలి. చేపట్టిన పనులను కొంత మందకోడీగా సాగుతాయి.

కర్కాటకం: అధికారులు అనుగ్రహంతో ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాల్లో లాభాలు పొందుతారు. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆర్థికంగా మెరుగైన పరిస్థితులు ఉంటాయి. భూ క్రయవిక్రయాలలో లాభాలు అందుతాయి.

సింహం: ఇతరులకు సైతం సహాయ సహకారాలు అందిస్తారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఇంటా బయట సమస్యల నుంచి బయటపడతారు. సన్నిహితులు నుండి ముఖ్యమైన సమాచారం అందుతుంది. నిరుద్యోగులు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

కన్య: విలువైన వస్త్రాలు ఆభరణాలు కొనుగోలు చేస్తారు. సమాజంలో ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు లభిస్తాయి. వృత్తి ఉ ద్యోగాలలో ఆటంకాలు అధిగమించి ముందుకు సాగుతారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి అవుతాయి. కీలక సమయంలో సన్నిహితుల సాయం అందుతుంది.

తుల: పాత మిత్రులతో గృహమున సంతోషంగా గడుపుతారు. పెద్దల ఆరోగ్యం విషయంలో శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తుంది. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు.

వృశ్చికం: దైవ అనుగ్రహం తో కొన్ని పనులు పూర్తి చేస్తారు. సంఘం లో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. సంతానానికి విద్య ఈ విషయాలపై దృష్టి సారించడం మంచిది. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. వృత్తి ఉద్యోగాలలో సమస్యల నుండి బయటపడతారు. ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

ధనస్సు: వృత్తి ఉద్యోగాలలో అధికారులతో అకారణ వివాదాలు కలుగుతాయి. వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. దూర ప్రయాణాలు వాయిదా వేయుట మంచిది. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసిక ఆందోళనలు తప్పవు.

మకరం: బంధు మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. మిత్రులతో ఏర్పడ్డ వివాదాలు పరిష్కారమవుతాయి. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయమై అశ్రద్ధ చేయడం మంచిది. కాదు. చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలు కలిగిన సకాలంలో పూర్తి చేస్తారు. దైవ సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది.

కుంభం: నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. బంధువులతో ఏర్పడ్డ వివాదాలు పరిష్కారం అవుతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. వృధా ప్రయాణాలు చేస్తారు. ఉద్యోగుల సహొూద్యోగులతో వివాదాలు తొలగుతాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. అన్ని రంగాల వారికి అనువైన కాలం.

మీనం: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక వ్యవహారాలు మరింత అనుకూలంగా ఉంటాయి. గృహంలో శుభకార్యాల గూర్చి చర్చ జరుగుతుంది. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు. నూతన వ్యాపారాలలో పెట్టుబడులు పెట్టే విషయంలో పునరాలోచన చేయడం మంచిది.

# 100% పీఎఫ్ విత్‌డ్రా

మొదటి పేజీ తరువాయి

గృహ అవసరాలు, ప్రత్యేక పరిస్థితులుగా మార్చింది. పీఎఫ్ విత్‌డ్రా లిమిట్లను కూడా ఈపీఎఫ్ఓ భారీగా పెంచింది. ముఖ్యంగా పిల్లల చదువుల కోసం పీఎఫ్ తీసుకోవడానికి ఉన్న పరిమితిని పాత రూల్స్‌లో ఉన్న 3 సార్ల నుంచి 10 సార్లకు పెంచింది. అదేవిధంగా వివాహం వంటి అవసరాల కోసం పీఎఫ్ పాక్షిక ఉపసంహరణకు ఉ న్న లిమిట్‌ను 3 సార్ల నుంచి 5 సార్ల వరకు పెంచింది. అంతేకాకుండా అన్ని రకాల పాక్షిక విత్ డ్రాకు పీఎఫ్ ఖాతాదారుల కనీస సర్వీసును గతంలో ఉన్న దాని కంటే తగ్గించి 12 నెలలకు మాత్రమే నిర్ణయించారు. పీఎఫ్ ఖాతాదారులు భవిష్యత్తులోనూ అధిక ప్రయోజనం పొందడానికి వీలుగా ఒక కొత్త నియమాన్ని అమలులోకి తెచ్చారు. అదేంటంటే పీఎఫ్ అకౌంట్‌లో జమ చేసే మొత్తంలో 25 శాతాన్ని కనీస బ్యాలెన్స్‌గా తప్పనిసరిగా ఉంచేలా రూల్ తీసుకొచ్చా రు. దీనివల్ల పదవీ విరమణ సమయంలో ఈపీఎఫ్‌వో అందించే అధి క వడ్డీ ప్రయోజనాన్ని పెద్ద మొత్తంలో పొందేందుకు వీలవుతుంది. ఈ మార్పుల ద్వారా ఉద్యోగులు తమ ప్రస్తుత ఆర్థిక అవసరాలు తీర్చు కుంటూనే, పదవీ విరమణ నిధికి కూడా భద్రత కల్పించినట్లయింది.

# బంగారం మూటలు

మొదటి పేజీ తరువాయి

పెరగడానికి ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న పరిస్థితులే కారణంగా చెబుతున్నారు. ముఖ్యంగా బంగారం ధరలు పెరగడానికి అమెరికా ప్రస్తుతం చైనా పైన మరికొన్ని సుంకాలు విధిస్తుందని వార్తలు వస్తున్నాయి ఈ నేపథ్యంలోనే బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరో 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తుందని వార్తలు జోరు అందుకోవడంతోపాటు డాలర్ విలువ పతనం కూడా బంగారం ధర పెరగడానికి దోహద పడిందని చెప్పవచ్చు. ఇది ఇలా ఉంటే దీపావళి నాటికి బంగారం ధర పెరుగుతుందా లేక తగ్గుతుందా అని చాలామంది ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

### గత పదిరోజులుగా బంగారం ధరలు ఇలా..

- అక్టోబర్ 13 రూ.12,540
- అక్టోబర్ 12 రూ.12,508
- అక్టోబర్ 11 రూ.12,508
- అక్టోబర్ 10 రూ.12,371
- అక్టోబర్ 9 రూ.12,415
- అక్టోబర్ 8 రూ.12,393
- అక్టోబర్ 7 రూ.12,202
- అక్టోబర్ 6 రూ.12,077
- అక్టోబర్ 5 రూ.11,940
- అక్టోబర్ 4 రూ.11,940

# వెండి కోటలు

మొదటి పేజీ తరువాయి

చేరింది. ఇప్పటివరకు అత్యధిక స్థాయికి చేరుకుంది. పరిశ్రమలలో డిమాండ్ పెరగడం, సరఫరా తగ్గడం, పెట్టుబడిదారులకు ఇది సురక్షితమైన సాధనంగా పరిగణించడం వంటి కారణాల వల్ల బంగారం, ఇత ర పెట్టుబడి సాధనాలతో పోలిస్తే వెండి అద్భుతమైన రాబడిని ఇచ్చింది. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారంి, ధరలో ఈ పెరుగుదల కొనసాగవచ్చు.

### గత పది రోజులుగా వెండి ధరలు ఇలా..

- అక్టోబర్ 13 రూ.1,97,000
- అక్టోబర్ 12 రూ.1,90,000
- అక్టోబర్ 11 రూ.1,90,000
- అక్టోబర్ 10 రూ.1,84,000
- అక్టోబర్ 9 రూ.1,77,000
- అక్టోబర్ 8 రూ.1,70,000
- అక్టోబర్ 7 రూ.1,67,100
- అక్టోబర్ 6 రూ.1,67,000
- అక్టోబర్ 5 రూ.1,65,000
- అక్టోబర్ 4 రూ.1,65,000

# రాజగోపాల్ రాజ్యం!

మొదటి పేజీ తరువాయి

రూల్ పెట్టారు ప్రజలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడం, మానవ జీవన ప్రమాణాలు పెంచడం, బెల్ట్ షాపుల నిర్మూలన, మహిళా సాధికారతే తమ ఉద్దేశమని అన్నారు. ఈ రూల్స్ రాష్ట్ర ప్రభుత్వ ఎక్సైజ్ పాలసీతో సంబంధం లేదని, ఎవరిని ఇబ్బంది పెట్టాలని కాదు, నియోజకవర్గ ప్రజలు, యువత మద్యం మత్తును వదిలి ఆర్థికంగా ఎదగాలని తన కోరిక అన్నారు. మద్యం దుకాణాలకు టెండర్లు వేసే వారిని భయపెట్టడానికి ఇలా రాజగోపాల్ రెడ్డి ముందస్తుగా బెదిరించారని, తనను కాదని మద్యం దుకాణాలు నడపలేరన్న సంకేతాలను ఇలా పంపించారని స్థానిక వ్యాపారులు అంటున్నారు. కేవలం సాయంత్రం పూట మాత్రమే మద్యం అమ్మాలి.. ఊరు బయటే దుకాణాలు ఉ ఒడాలని ఆయన రూల్స్ పెట్టడం.. చాలా మందిని ఆశ్చర్య పరుస్తోంది. ప్రభుత్వ రూల్స్ ను కాదని.. తన సొంత రూల్స్ ను ప్రకటించడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

### కొత్త మద్యం పాలసీపై హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్/అఫ్జల్‌గంజ్, అక్టోబర్ 13 (ఈవార్తలు): కొత్త మద్యం పాలసీపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అనిల్‌కుమార్ అనే వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశాడు. ఒక్కో దరఖాస్తుకు రూ.3 లక్షల రుసుం పెట్టారని పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశాడు. లాటరీలో షాపు దక్కకపోతే రూ.3 లక్షలు అబ్కారీ శాఖకే వెళ్తాయని.. డబ్బును తిరిగిచ్చేలా ఆ శాఖను ఆదేశించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశాడు. లిక్కర్ పాలసీపై జారీ చేసిన జీవోను కొట్టివేయాలని కోరాడు. దీనిపై ఆబ్కారీశాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేస్తూ విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది.

# ఎల్ఈడీ స్క్రీన్లలో రాజన్న దర్శనం

మొదటి పేజీ తరువాయి

శాఖ సమాచారం ప్రకారం, భక్తుల కోసం అర్జిత సేవలు కూడా తాత్కాలికంగా అందుబాటులో ఉండనున్నాయి. ప్రత్యేక సేవలు, ప్రసాదాల పంపిణీ, వసతి సదుపాయాలను కూడా తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా, రాబోయే మేడారం జాతరకు వచ్చే భక్తులు కూడా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రధాన ఆలయ నిర్మాణం పూర్తయ్యే వరకు ఈ తాత్కాలిక దర్శన ఏర్పాట్లు అమల్లో ఉండనున్నాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ సౌకర్యాలు జనవరి 2026 వరకు కొనసాగుతాయి.

### ఆలయం బంద్ అవాస్తవం: ఆది శ్రీనివాస్

రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణలో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా భీమేశ్వర ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. సోమవారం భీమేశ్వర ఆలయంలో తుది దశకు చేరిన ఏర్పాట్లను ఆలయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ వారు మాట్లాడుతూ రాజన్న ఆలయం అభివృద్ధి విస్తరణ చేపడు తున్న నేపథ్యంలో స్వామి వారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాజన్న ఆలయ భక్తుల వసతులపై ప్రత్యేక దృష్టి సారించి ఆలయా న్ని అభివృద్ధి చేస్తుందన్నారు. రాజన్న ఆలయం బంద్ అనేది ఆ వాస్తవమని, ప్రతినిత్యం ఆలయంలో స్వామివారికి నిత్య పూజలు ఏకాంతంగా జరుగుతాయన్నారు. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా పనిచేస్తాం అని ఆది శ్రీనివాస్ తెలిపారు. విప్ వెంట ఈవో రమా దేవి ఈఈ రాజేశ్ డీఈ రఘునందన్ ఏఈఓ శ్రీనివాస్, ఉమేష్ శర్మ స్థానాచారి నమిలికొండ ఉమేశ్ శర్మ తదితరులు ఉన్నారు.

# ఓట్ చోరీ ఏంది వయ్యా?

మొదటి పేజీ తరువాయి

ప్రయత్నిస్తారని అన్నారు. "కొందరు పారిశ్రామికవేత్తల కోసం ప్రజల ఓటు హక్కును దొంగిలించాలని చూస్తున్నారు. బీహార్‌లో ఒక్క ఓటు కూడా చోరీకి గురికాకుండా చూస్తాం" అని రాహుల్ వ్యాఖ్యానించారు. రాహుల్ చేసిన ఈ ఆరోపణలపై సిట్ విచారణ జరపాలని కోరుతూ ఓ వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాను ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అందుకే న్యాయస్థానం జోక్యం చేసుకోవాలని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ వాదనలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకోలేదు. "ఇలాంటి రాజకీయ అంశాల కోసం కోర్టులను వేదికగా మార్చవద్దు. కాగా, రాహుల్ చేసిన ఆరోపణలను బీజేపీ నేతలు, ఎన్నికల సంఘం అధికారులు అప్పుడే తీవ్రంగా ఖండించిన విషయం తెలిసిందే.

# జూబ్లీహిల్స్‌లో ఓట్ల చోరీ

**ఎన్నికల సంఘానికి కేటీఆర్ ఫిర్యాదు.. కుమ్మక్కైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

హైదరాబాద్, అక్టోబర్ 13 (ఈవార్తలు): ఓట్ల చోరీపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫిర్యాదు చేశారు. పార్టీ నాయకులతో కలిసి ఫిర్యాదు చేసిన కేటీఆర్, ఎన్నికల సంఘానికి మూడు విజ్ఞప్తులు అందజేశారు. ఓట్ల చోరీపై వెంటనే పూర్తిస్థాయి విచారణ జరగాలని, క్షేత్రస్థాయిలో కుమ్మక్కైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, నామినేషన్ ప్రక్రియ ముగిసేలోపు విచారణ పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసిన అనంతరం కేటీఆర్ విలేకరులతో మాట్లాడుతూ, రాహుల్ గాంధీ అక్కడ ఓట్ల చోరీ అని గగ్గోలు పెడుతున్నారని, తెలంగాణలో మాత్రం వారే దొంగ ఓట్లతో గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. దొంగ ఓట్లపై ఆధారాలతో సహా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని, విచారణ కోరినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 20 వేల వరకు దొంగ ఓట్ల కోసం ప్రణాళికలు రచించిందని ఆయన ఆరోపించారు. నియోజకవర్గంలో ఒక ఇంట్లో 250 ఓట్లు, మరో ఇంట్లో 180, ఇంకొక ఇంట్లో 80, మరొక ఇంట్లో 90 ఓట్లు ఉన్నాయని ఆయన అన్నారు. ఒక ఇంట్లో 24 ఓట్లు ఉన్నాయని తనిఖీకి వెళ్లినప్పుడు, వారంతా ఎవరో తనకు తెలియదని ఇంటి యజమాని చెప్పారని ఆయన పేర్కొన్నారు. అక్కడకు వెళ్లి చూస్తే అవన్నీ దొంగ ఓట్లు అని తేలిందని అన్నారు.

300 నామినేషన్లు వేస్తాం: మాలలు

ఎస్సీ వర్గీకరణ విధానంపై మాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) తీవ్ర నిరసనకు సిద్ధమైంది. ఈ విధానం వల్ల తమ సామాజికవర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బరిలో ఏకంగా 300 మందితో నామినేషన్లు వేయించనున్నట్లు సంచలన ప్రకటన చేసింది. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తమ ఆవేదనను ప్రజాస్వామ్య పద్ధతిలో తెలియజేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఈరోజు నిర్వహించిన సమావేశంలో మాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్ మాట్లాడారు. గత ఐదు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఎస్సీ వర్గీకరణ విధానం వల్ల గ్రూప్-3లోని 25 మాల కులాలకు విద్య, ఉద్యోగ, పదోన్నతుల్లో తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

### నామినేషన్లు షురూ

జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నికకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ ఉత్సాహంగా మొదలైంది. తొలి రోజే పది మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అయితే, ఆసక్తికరంగా ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులెవరూ మొదటి రోజు తమ నామినేషన్లను సమర్పించకపోవడం గమనార్హం. తొలిరోజు బరిలోకి దిగిన 10 మందిలో ఇద్దరు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి ఉండగా, మిగిలినవారు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. తెలంగాణ పునర్నిర్మాణ సమితి తరపున పూస శ్రీనివాస్, నవతరం పార్టీ అభ్యర్థిగా అర్వపల్లి శ్రీనివాసరావు తమ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఇక స్వతంత్ర అభ్యర్థులుగా సిలివేరు శ్రీకాంత్, పెసరకాయల పరీక్షిత్ రెడ్డి, చలిక చంద్రశేఖర్, సపవత్ సుమన్, వేముల విక్రమ్ రెడ్డి, ఇబ్రహీం ఖాన్ తదితరులు నామినేషన్లు దాఖలు చేశారు. మొదటి రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ అంతా ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ముగిసిందని ఎన్నికల అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం చిన్న పార్టీలు, స్వతంత్రుల హడావుడితో మొదలైన నామినేషన్ల ప్రక్రియ, రానున్న రోజుల్లో మరింత వేడెక్కనుంది. కాగా, ఎన్నికల షెడ్యూల్ ప్రకారం 13 నుంచి 21వ తేదీ వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేయవచ్చు. 22న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు అక్టోబర్ 24వ తేదీని చివరి గడువుగా నిర్ణయించారు.

# హాస్టళ్లకు 60 కోట్లు

మొదటి పేజీ తరువాయి

వారికి లభించే కేలరీలను లెక్కించడానికి ప్రత్యేక యాప్‌ను ఉ పయోగించాలని సీఎం సూచించారు. యూనిఫాంలు, పుస్తకాలు సకాలంలో, సక్రమంగా అందేలా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. హాస్టళ్లలో ఉన్న సౌకర్యాలు, ఇతర వసతులు, వాటి నిర్వహణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు డాష్‌బోర్డ్‌లో అప్‌లోడ్ చేయాలని సీఎం స్పష్టం చేశారు.

### మెడికల్ కాలేజీలతో హాస్టళ్ల లింక్

హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో, ప్రతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులను హాస్టళ్లతో అనుసంధానించాలని ఆయన సూచించారు. హాస్టళ్లలో తరచుగా వైద్య శిబిరాలు నిర్వహించాలని, అత్యవసర సమయాల్లో వైద్యులు విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు తరచుగా హాస్టళ్లను సందర్శించి, విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లకు సంబంధించి స్కాలర్‌షిప్‌లు, సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, నిర్మాణ ఖర్చులు తదితర బకాయిల చెల్లింపుతో పాటు, హాస్టళ్ల నిర్వహణకు అయ్యే నెలవారీ ఖర్చులకు అవసరమైన మొత్తానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌లను సీఎం ఆదేశించారు. హాస్టళ్ల కోసం కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి నిధులను సమీకరించాలని, వాటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

# విద్య, ఉద్యోగవాణి

## దీ=ఖాఖలో ప్రవేశాలకు రెండు రోజులే ఛాన్స్

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి బీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తు గడువు ఈనెల 15తో ముగియనుంది. ఇదే చివరి అవకాశం అని విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ డా.వై.వెంకటేశ్వర్లు తెలిపారు. ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, 10o2 ఉత్తీర్ణులే అర్హులు. విద్యార్థులు దరఖాస్తుల కోసం www.braouonline.in వెబ్‌సైట్‌ను సంప్రదించాగలరు.

## ఏపీ సచివాలయంలో ఉద్యోగాలు

ఏపీలోని గ్రామ, వార్డు సచివాలయంలో ఉద్యోగాల పదోన్నతులపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పదోన్నతుల కల్పనపై అధ్యయనం చేసేందుకు 10 మంది మినిస్టర్లతో క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో డిప్యూటీ సీఎం పవన్‌తో పాటు మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, నారాయణ, డీఎస్‌బీవీ స్వామి, అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, సత్యకుమార్, గొట్టిపాటి రవి కుమార్, సంధ్యారాణి సభ్యులుగా ఉన్నారు.

# ఆర్థికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

స్టాక్‌హోం 'ఆవిష్కరణల ఆధారిత ఆర్థిక వృద్ధిపై' పరిశోధనలకు గానూ ఈ ఏడాది ముగ్గురు ఆర్థిక వేత్తలు జోయల్ మోకిర్, ఫిలిప్ అగియన్, పీటర్ హొవిట్‌లకు ఆర్థిక శాస్త్రంలో నోబెల్ పురస్కారం లభించింది. వీరిలో జోయల్ మోకిర్‌కు బహుమతిలో సగం మొత్తం చెందుతుంది. సాంకేతిక పురోగతి ద్వారా సుస్థిర వృద్ధిని సాధించేందుకు ముందస్తుగా అవసరమైన వాటిని గుర్తించడానికి ఆయన కృషి చేశారు. మిగిలిన సగం మొత్తాన్ని అగియన్, హొవిట్ పంచుకుంటారు. సుస్థిరమైన అభివృద్ధి లేదా పురోగతి అనేది సరికొత్త సాధారణ స్థాయికి మారేందుకు గల కారణాలు వెల్లడించడానికి చారిత్రక వనరులను ఒక మార్గంగా మోకిర్ ఉ పయోగించారు. ఈ సుస్థిర వృద్ధి వెనుక గల మెకానిజంను అగియన్, పీటర్ హొవిట్ కూడా అధ్యయనం చేశారు. 1992లో వారు సృజనాత్మక విధ్వంసం అని పిలిచే ఒక గణిత నమూనాను రూపొందించారు. ఈ మేరకు వారు ఒక వ్యాసం కూడా రాశారు. ఇక్కడ సృజనాత్మక విధ్వంసం అంటే కొత్తదైన, మెరుగైన ఉత్పత్తి మార్కెట్‌లోకి ప్రవేశిస్తే, కంపెనీలు పాత ఉత్పత్తులను తక్కువ మొత్తాలకు విక్రయించడమని వారు పేర్కొన్నారు. 'సృజనాత్మకమైన విధ్వంసం ద్వారా సుస్థిర వృద్ధి సిద్ధాంతాన్ని రూపొందించినందుకు' గానూ వీరికి ఈ పురస్కారం ఇస్తున్నట్లు నోబెల్ కమిటీ ఒక ప్రకటన విడుదల చేసింది. వీరిలో జోయెల్ మోకిర్ నెదర్లాండ్స్‌లో జన్మించారు. అమెరికాలోని నార్త్ వెస్ట్రన్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా వున్నారు. ఫిలిప్ అగియన్ ఫ్రాన్స్‌లోని ఒక ఉన్నత విద్యా, పరిశోధన సంస్థ అయిన కాలేజ్ డి ఫ్రాన్స్‌లో, పారిస్‌లోని ఐఎన్ఎస్ఇఎడి, యుకెలోని లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్సులలో ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు.

# సీజీహెచ్‌ఎస్ ధరల్లో మార్పు

## కేంద్ర ఉద్యోగులకు కేంద్రం బొనాంజా.. 15 ఏళ్ల తర్వాత ప్యాకేజీ రేట్ల సవరణ

**2000 రకాల వైద్య సేవలు, చికిత్సల ధరల్లో మార్పులు.. వెంటనే అమల్లోకి వచ్చిన కొత్త రేట్లు**

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వం నుంచి వరుసగా ఊరట లభిస్తోంది. ఇటీవలే కరవు భత్యం (డీఏ) పెంచుతూ నిర్ణయం తీసుకున్న కేంద్రం, తాజాగా మరో కీలక ప్రకటన చేసింది. దాదాపు 15 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) కింద వైద్య చికిత్సల ప్యాకేజీ రేట్లను సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో లక్షలాది మంది ఉద్యోగులు, పెన్షనర్లు నాణ్యమైన వైద్య సేవలు పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులు తొలగిపోనున్నాయి. గత కొన్నేళ్లుగా అమల్లో ఉన్న పాత రేట్ల వల్ల ఉ ద్యోగులతో పాటు సీజీహెచ్ఎస్ పరిధిలోని ఆసుపత్రులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా పలు ఆసుపత్రులు నగదు రహిత (క్యాష్‌లెస్) చికిత్సలను నిరాకరిస్తున్నాయని, రోగుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నాయని పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. అంతేకాకుండా చికిత్స ఖర్చుల రీయింబర్స్‌మెంట్‌లో జరుగుతున్న తీవ్ర జాప్యం కూడా ఉ ద్యోగులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసింది. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగానే ప్రభుత్వం సుమారు 2000 రకాల వైద్య ప్రక్రియల ధరలను సవరిస్తూ తాజా మార్పులకు శ్రీకారం చుట్టింది. సీజీహెచ్ఎస్ డైరెక్టరేట్ జనరల్ జారీ చేసిన కొత్త మార్గదర్శకాల ప్రకారం, సవరించిన రేట్లు నేటి (2025 అక్టోబర్ 13) నుంచే అమల్లోకి వచ్చాయని ప్రభుత్వం తన ప్రకటనలో స్పష్టం చేసింది. సీజీహెచ్ఎస్ పరిధిలోని అన్ని ఆసుపత్రులకు, అలాగే ఉద్యోగులు, పెన్షనర్లు పెట్టుకునే రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌లకు ఈ కొత్త రేట్లు వర్తిస్తాయి. పెన్షనర్లకు నగదు రహిత చికిత్సలు యథావిధిగా కొనసాగుతాయని కూడా ప్రభుత్వం హామీ ఇచ్చింది. కొత్త రేట్లను పలు అంశాల ఆధారంగా నిర్ణయించారు. ఆసుపత్రి ఉన్న నగరం, దానికి ఉన్న అక్రిడిటేషన్ (గుర్తింపు), వార్డుల రకం వంటివి ధరలను ప్రభావితం చేస్తాయి. ఉ దాహరణకు టైర్-1 నగరాలతో పోలిస్తే టైర్-2 నగరాల్లో 10 శాతం, టైర్-3 నగరాల్లో 20 శాతం తక్కువగా రేట్లు ఉంటాయి. అలాగే, జాతీయ అక్రిడిటేషన్ బోర్డు గుర్తింపు (ఎన్ఏబీహెచ్) లేని ఆసుపత్రులకు 15 శాతం తక్కువ ధరలు వర్తిస్తాయి. మరోవైపు ప్రైవేట్ వార్డుల రేట్లను 5 శాతం పెంచగా, జనరల్ వార్డుల రేట్లను 5 శాతం తగ్గించారు. తాజా నిర్ణయంతో వైద్య చికిత్సల విషయంలో ఉద్యోగులు, పెన్షనర్లకు పెద్ద ఊరట లభించినట్లయింది.

# ధర్మం మా వైపే ఉంది

## హైదరాబాద్ ప్రజలకు కాంగ్రెస్ గురించి తెలుసు.. గ్రామాల్లో గెలిపించిన ప్రజలు హస్తం నేతలపై కోపంతో ఉన్నారు

**అజారుద్దీన్‌కు ఇచ్చిన ఎమ్మెల్సీ కోర్టులో నిలబడదు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్, అక్టోబర్ 13 (ఈవార్తలు): జూబ్లీహిల్స్‌లో పోరు మొదలైందని, ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. నిజం, ధర్మం కూడా బీఆర్ఎస్ పక్షానే ఉన్నాయని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగిస్తూ, కాంగ్రెస్ పార్టీ గురించి, రేవంత్ రెడ్డి గురించి హైదరాబాద్ నగర ప్రజలకు బాగా తెలుసని, అందుకే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా దక్కలేదని అన్నారు. అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించిందని గుర్తుచేశారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రజలు సైతం ఇప్పుడు ఆగ్రహంతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కానీ, ఒక్క ముస్లిం ఎమ్మెల్సీ కానీ



లేరని ఆయన విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అజారుద్దీన్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుండి పోటీ చేశారని, ఈసారి కూడా ఆయన టిక్కెట్ ఆశిస్తారని భావించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయనను తప్పించేందుకు కేవలం కాగితంపై 'ఎమ్మెల్సీ' అని రాసి మోసం చేశారని విమర్శించారు. అజారుద్దీన్‌కు ఇచ్చే ఎమ్మెల్సీ నిలబడదని రేవంత్ రెడ్డికి తెలుసని అన్నారు. ఈ విషయం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని ఆయన తెలిపారు. షేక్‌పేటలో కబరస్థాన్‌కు ఇచ్చిన స్థలం కూడా ఆర్మీకి చెందినదని, అది కూడా కోర్టులో నిలబడదని ఆయన అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అని చెప్పారని, అది కూడా కోర్టులో నిలబడలేదని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డికి అన్నీ తెలిసినా ప్రజలను మోసం చేయడానికి ఇలాంటి పనులు చేస్తున్నారని ఆయన విమర్శించారు. బీసీలను, మైనార్టీలను ముఖ్యమంత్రి మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు గట్టిగా బుద్ధి చెబితే, ఢిల్లీలోని అధిష్ఠానం సైతం ఉలిక్కిపడుతుందని వ్యాఖ్యానించారు. ప్రజలు మోసపోయి ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం నెలకొందని అన్నారు. దుర్గాదేవిలాగా, కాళికాదేవిలాగా కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామని ఇప్పుడు ప్రతి మహిళ అంటోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్లు నమోదు చేయించిందని ఆయన ఆరోపించారు. ఒక ఇంట్లో అయితే ఏకంగా 43 దొంగ ఓట్లు నమోదు చేయించారని అన్నారు. కాంగ్రెస్ ఒక్కో వర్గానికి చాలా బాకీ పడిందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ బాకీ కార్డును ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. పెన్షన్ పెంపు, మహిళలకు నెలకు రూ. 2,500, నిరుద్యోగ భృతి ఇలా అన్నీ కాంగ్రెస్ బాకీలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.

## జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థిగా దీపక్‌రెడ్డి?

హైదరాబాద్, అక్టోబర్ 13 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికకు సంబంధించి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తన అభ్యర్థిని ఖరారు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. పలువురు నేతల పేర్లను పరిశీలించిన పార్టీ జాతీయ నాయకత్వం, చివరికి దీపక్‌రెడ్డి వైపే మొగ్గు చూపినట్లు సమాచారం. దీనిపై ఏ క్షణంలోనైనా అధికారిక ప్రకటన వెలువడవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. జూబ్లీహిల్స్ బరిలో నిలిపే అభ్యర్థిని ఎంపిక చేసేందుకు ఢిల్లీలో ఆదివారం కీలక సమావేశాలు జరిగాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు శనివారమే దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి, పద్మ పేర్లతో కూడిన జాబితాను అధిష్ఠానానికి పంపించారు. దీనిపై ఆదివారం సమావేశమైన బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. ముఖ్యంగా, నియోజకవర్గంలో లక్ష మందికి పైగా ఉన్న ముస్లిం ఓటర్లను దృష్టిలో ఉంచుకుని, అభ్యర్థి ఎంపికపై వ్యూహాత్మకంగా అడుగులు వేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసిన మాధవీలత పేరు కూడా ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం.

# నేనేంటో అందరికీ తెలుసు

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**


మేడారం, అక్టోబర్ 13 (ఈవార్తలు): తెలంగాణ కేబినెట్లో మంత్రుల మధ్య రోజుకో పోరు జరుగుతోంది. ఇప్పటికే ఎస్సీ మంత్రుల మధ్య ఓ పోరు, అంతకంటే ముందు ఓ బీసీ మంత్రికీ, ఎస్సీ మంత్రికీ మధ్య పోరు, ఇప్పుడు ఓ మహిళా మంత్రికీ, పురుష మంత్రికీ మధ్య పోరు కొనసాగుతోంది. తాజాగా మంత్రి కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి సహచర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై ఫిర్యాదు చేశారు. సమ్మక్క-సారలమ్మ జాతర విషయంలో పొంగులేటి జోక్యంపై ఆమె ఫిర్యాదు చేసారు. దీనిపై ఆయన స్పందించారు. సమ్మక్క-సారలమ్మ జాతర విషయంలో 70 కోట్ల కాంట్రాక్టులకు సంబంధించి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జోక్యం చేసుకోవడంపై మరో మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి తాజాగా అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఈ వ్యవహారం తెలంగాణ ప్రభుత్వంలో మరో రచ్చకు కారణమవుతోంది. దీనిపై అధిష్టానానికి తన అభిప్రాయం చెప్తానంటూ తాజాగా సీఎం రేవంత్ రెడ్డి కూడా వెల్లడించారు. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి ఇవాళ కొండా దంపతుల ఫిర్యాదుపై స్పందించారు. తనపై సహచర మంత్రి అధిష్టానానికి ఫిర్యాదు చేశారంటే నమ్మబుద్ది కావడం లేదంటూ



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇవాళ వ్యాఖ్యానించారు. అయినా తానేంటో అందరికీ తెలుసన్నారు. 70 కోట్ల కాంట్రాక్టు కోసం తాను తాపత్రయం పడాల్సిన అవసరం లేదన్నారు. తనపై ఫిర్యాదు చేయడానికి ఏముందని పొంగులేటి ఎదురు ప్రశ్నించారు. మంత్రులు సీతక్క, సురేఖ ఇద్దరూ సమ్మక్క-సారలమ్మలాగ జాతర కోసం పనిచేస్తున్నారని ఆయన కితాబిచ్చారు. ఇవాళ సమ్మక్క-సారలమ్మ జాతర పనుల్ని పరిశీలించిన మంత్రి పొంగులేటి.. ఈ జాతర కోసం 212 కోట్లు కేటాయించామని, ఇంకా నిధులు అవసరమైనా ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. అయితే గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆయన సూచించారు. మేడారానికి వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు ఉండాలని, దీనిపై అందరి సూచనలు తీసుకుంటామని ఆయన ప్రకటించారు.

# చాలా చిన్న అంశం

**మంత్రుల వివాదంపై టీపీసీసీ చీఫ్**



న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబర్ 13 (ఈవార్తలు): రాష్ట్రంలో మంత్రుల మధ్య తలెత్తిన వివాదంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఇది చాలా చిన్న అంశమని, తమ కుటుంబ సమస్య అని, దీనిని తామే పరిష్కరించుకుంటామని ఆయన అన్నారు. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఆయన పరామర్శించారు. ఇటీవల ఖర్గేకు పేస్‌మేకర్ అమర్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఖర్గేను కలిశారు. అనంతరం మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, సమాచార లోపం వల్లే మంత్రుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయని చెప్పారు. బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే విధించడం సహా ఇటీవల రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాలను ఖర్గేకు వివరించినట్లు మీడియాకు తెలిపారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని స్పష్టం చేశారు.

# పోలియో చుక్కలు వేశాక పసికందు మృతి

**సంగారెడ్డి జిల్లాలో విషాదం**




సంగారెడ్డి, అక్టోబర్ 13 (ఈవార్తలు): సంగారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పోలియో చుక్కలు వేసిన కొద్దిసేపటికే మూడు నెలల మగ శిశువు మృతి చెందడం కలకలం రేపింది. పోలియో చుక్కలు వికటించడం వల్లే తమ బిడ్డ ప్రాణాలు కోల్పోయాడని తల్లిదండ్రులు ఆరోపిస్తుండగా, అది నిజం కాదని వైద్యులు, స్థానిక ఎమ్మెల్యే స్పష్టం చేస్తున్నారు. కంగ్టి మండలం భీంరా గ్రామానికి చెందిన సర్కున్‌దొడ్డి ఉమాకాంత్, స్వర్ణలత దంపతులకు ముగ్గురు కుమార్తెలు, మూడు నెలల కుమారుడు ఉన్నారు. ఆదివారం తల్లి స్వర్ణలత తన పిల్లలందరినీ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి పోలియో చుక్కలు వేయించారు. పోలియో డ్రాప్స్ వేసిన తర్వాత బాబు ఏడుస్తుండటంతో, స్వర్ణలత పాలు పట్టేందుకు ప్రయత్నించింది. అదే సమయంలో పసికందు ప్రాణాలు విడిచాడు. పోలియో చుక్కల వల్లే తమ కుమారుడు మరణించాడని ఆరోపిస్తూ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పీహెచ్‌సీ వైద్యాధికారి నాగమణి స్పందిస్తూ "శిశువుకు వాడిన సీసా నుంచే మరో 17 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశాం. చిన్నారి ముగ్గురు అక్కలకు కూడా అవే చుక్కలు వేశాం. ఎవరికీ ఎలాంటి సమస్యా రాలేదు. అసలు కారణం పోస్టుమార్టం నివేదికలో తెలుస్తుంది" అని వివరించారు. ఈ విషయంపై నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి కూడా స్పందించారు. శిశువు మృతికి పోలియో చుక్కలు గానీ, వైద్యుల నిర్లక్ష్యం గానీ కారణం కాదని ఆయన తెలిపారు. "వైద్యాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నాను. పోలియో చుక్కలు వేసిన తర్వాత తల్లి పాలు పట్టడంతో బాబు వాంతి చేసుకున్నాడు. ఆ వాంతి గొంతులో అడ్డుపడటం (పొలమారడం) వల్లే దురదృష్టవశాత్తు మృతి చెందాడు" అని ఎమ్మెల్యే వివరణ ఇచ్చారు. ప్రస్తుతం పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# చిరును కలిసిన రాంచందర్ రావు ఫ్యామిలీ



హైదరాబాద్, అక్టోబర్ 13 (ఈవార్తలు): తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు తన మనవరాలి కోరిక మేరకు ఆమెతో కలిసి మెగాస్టార్ చిరంజీవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆస్ట్రేలియాలో నివసిస్తున్న రామచందర్ రావు మనవరాలు ఐరా ఆశీష్ ఇటీవల భారత్‌కు వచ్చారు. చిరంజీవిని కలవాలన్న ఆమె ఆకాంక్ష మేరకు, ఆయన కుటుంబ సభ్యులతో కలిసి షూటింగ్ స్పాట్‌కు వెళ్ళి కలిశారు. ఈ విషయాన్ని రామచందర్ రావు 'ఎక్స్' వేదికగా తెలియజేశారు. చిరంజీవితో పాటు హీరోయిన్ నయనతారను కూడా రామచందర్ రావు కుటుంబ సభ్యులు కలిశారు. చిరంజీవితో జరిగిన సమావేశంలో సినిమా విశేషాలతో పాటు, సమకాలీన రాజకీయాలు, ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించి పలు ఆలోచనలు పంచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంతో బిజీగా ఉన్నప్పటికీ చిరంజీవి ఎంతో ఆప్యాయతతో, విలువైన సమయం కేటాయించారని రామచందర్ రావు అన్నారు. తమకు సమయం ఇచ్చినందుకు చిరంజీవికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. చిరంజీవితో జరిగిన ఈ కలయిక తమ కుటుంబానికి ఒక మరపురాని ఆనందాన్నిచ్చిందని ఆయన అన్నారు.

## తమ్ముడినే చంపాడు.. నన్నూ చంపొచ్చు!

**ఎర్రశేఖర్‌పై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన ఆరోపణలు**



జడ్చర్ల, అక్టోబర్ 13 (ఈవార్తలు): జడ్చర్ల రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారన్న ప్రచారంపై స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. ఎర్రశేఖర్ ఎమ్మెల్యే పదవి కోసం తనను హత్య చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదని అన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గతంలో తన సొంత తమ్ముడిని సర్పంచ్ పదవి కోసం హత్య చేశారని అనిరుధ్ రెడ్డి ఆరోపించారు. "అలాంటి వ్యక్తి ఎమ్మెల్యే పదవి కోసం నన్ను చంపడానికి కూడా వెనుకాడడు. ఆయన నుంచి రక్షణ కోసం నేను జెడ్ కేటగిరీ భద్రత కోరాలా?" అని తీవ్ర స్వరంతో ప్రశ్నించారు. ఇప్పటివరకు జడ్చర్లలో ప్రశాంత రాజకీయ వాతావరణం ఉందని, ఫ్యాక్షన్ రాజకీయాలు లేవని ఆయన గుర్తుచేశారు. ఎర్రశేఖర్ కాంగ్రెస్‌లో చేరడాన్ని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఏ ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా అంగీకరించరని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. "ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించడానికి ప్రయత్నించిన వారిని తిరిగి పార్టీలోకి ఎలా తీసుకుంటారు? అలాంటి వారికి కనీసం గేటు దగ్గర అపాయింట్‌మెంట్ కూడా దొరకదు" అని అన్నారు. కేవలం మీడియాలో ప్రచారం కోసమే ఎర్రశేఖర్ ఇలాంటి లీకులు ఇస్తూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. పార్టీకి ద్రోహం చేసిన వారిని తిరిగి చేర్చుకునే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ నాయకత్వం చాలా స్పష్టమైన వైఖరితో ఉన్నారని అనిరుధ్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కాగా, ఎర్రశేఖర్ గత అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే.

## వరంగల్ కలెక్టరేట్‌లో ఉద్యోగినిపై లైంగిక దాడి యత్నం



వరంగల్, అక్టోబర్ 13 (ఈవార్తలు): ప్రజలకు రక్షణగా నిలవాల్సిన ప్రభుత్వ కార్యాలయంలోనే ఓ అధికారి దారుణానికి ఒడిగట్టాడు. తోటి మహిళా ఉద్యోగిపై లైంగిక దాడికి ప్రయత్నించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఆరోపణలపై ఎస్టాబ్లిష్మెంట్ విభాగంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్‌ను జిల్లా కలెక్టర్ తక్షణమే సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళితే, రెండు రోజుల క్రితం కలెక్టరేట్ ప్రాంగణంలోనే నిందితుడైన సీనియర్ అసిస్టెంట్.. తనతో పాటే పనిచేసే మహిళా సిబ్బందిపై అఘాయిత్యానికి ప్రయత్నించాడు. అతని బారి నుంచి చాకచక్యంగా తప్పించుకున్న బాధితురాలు నేరుగా సుబేదారి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా పోలీసులు నిందితుడిపై లైంగిక వేధింపులతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఫణికుమార్ తెలిపారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి నిందితుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, కలెక్టరేట్ వంటి కీలకమైన ప్రదేశంలో ఒక అధికారి ఇంతటి దారుణానికి పాల్పడటం వెనుక ఉన్నతాధికారుల అండదండలు ఉన్నాయని తోటి మహిళా ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గత నెలలో ఇలాంటి వేధింపుల ఆరోపణలు వచ్చిన మరో ఉద్యోగిని కేవలం బదిలీ చేసి చేతులు దులుపుకొన్నారని వారు గుర్తుచేస్తున్నారు. ఈ తాజా ఘటనతో కలెక్టరేట్‌లోని మహిళా సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు.

## సోషల్ వాణి



జగిత్యాల నుండి గొల్లపల్లి పొయ్యే తొవ్వల మోతె తాళ్లకాడ ఈ లొంద వడ్డది.. చిన్నగమెల్లగ ఐదారించుల లోతుంటది. ఈ లొంద వడి దగ్గరదగ్గర యాడాది అయ్యింది. బండ్ల మీద లగాంచి పోయేటోళ్లు అండ్లకెళ్ళి, గిట్ల పోతే సక్కగ బొక్కల దవాఖాన తొవ్వ వట్టుడే. మా ఘనత వహించిన జగిత్యాల మున్సిపాలిటీ, స్థానిక నాయకులు ఇతరత్రా పనుల్లో రికాం లేకుండా ఉంటుండ్రు. గన్క ప్రజలారా. మీ పానాలు పైలం జెర. దీని పక్కపొంటే ఇంకో లొంద సుత ఉంటది. అది నాలుగించుల లోతుంటది.

- సుధీర్ కుమార్ తాండ్ర



# అంజన్న హుండీ ఆదాయం రూ.కోటి 8 లక్షలు

మల్యాల, అక్టోబర్ 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామివారి దేవస్థానంలో సోమవారం హుండీల లెక్కింపు జరిగింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) టీ శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో కరీంనగర్‌కు చెందిన వెంకట అన్నమాచార్య సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 12 హుండీలలోని విరాళాలను లెక్కించారు. మొత్తంగా 81 రోజులకు గానూ దేవస్థానానికి రూ.1,08,72,591 ఆదాయం సమకూరింది. హుండీ లెక్కింపు సందర్భంగా వచ్చిన మిశ్రమ వెండి, బంగారాన్ని తూకం వేసి సీల్ చేశారు. విదేశీ కరెన్సీ 55 నోట్లు లభించాయి. లెక్కింపును దేవాదాయ శాఖ కమిషనర్-కరీంనగర్ సునీత సుహాని, రాజమౌళి (పరిశీలకులు, దేవాదాయ శాఖ), రాజు (జగిత్యాల డివిజన్ గార్డు) పర్యవేక్షించారు. సునీల్ కుమార్ (నోడల్ అధికారి), సుందరి మాధురవాణి (ఉప ఖజానా అధికారి), రామకృష్ణ (ఆలయ ప్రధాన అర్చకుడు), రఘు (ఆలయ సిబ్బంది), వీవీఎస్ఎన్, మహాకానిశెట్టి అనబిల్, చెర్నాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు ఉచిత ఇసుక

**యుద్ధప్రాతిపదికన ఇండ్లు పూర్తవ్వాలి**

**అధికారులకు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశం**



జగిత్యాల టౌన్, అక్టోబర్ 13 (ఈవార్తలు): ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యుద్ధ ప్రాతిపదికన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలో 10,982 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా 7,343 మార్కౌట్ చేయగా, 2,984 బేస్మెంట్ స్థాయిలో, 721 గోడల నిర్మాణం వరకు, 369 స్లాబ్ దశ వరకు, 3 ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకున్నాయని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో జగిత్యాల జిల్లా 22 స్థానంలో ఉందని, అధికారులు మెదటి 5 స్థానాల్లో ఉండేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. ప్రొసీడింగ్ ఇచ్చిన ఇండ్ల నిర్మాణం పనులు దీపావళి వరకు ప్రారంభించకపోతే రెండు, మూడు సార్లు నోటీసులు ఇచ్చి ఇతర అర్హులైన లబ్ధిదారులను ఎంపికచేయాలని ఆదేశించారు. జగిత్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన ఇసుక బజార్ నుంచి ఇందిరమ్మ లబ్ధిదారులకు ఉచిత ఇసుక లభిస్తుందని, అవసరమైన లబ్ధిదారులు ఇక్కడే ఉచిత ఇసుక పొందేలా సూచించాలని తెలిపారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్, జగిత్యాల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాస్, ట్రెయినీ అదనపు కలెక్టర్ కన్నం హరిణి, హౌజింగ్ పీడీ ప్రసాద్, డీపీవో మదన్మోహన్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, క్లస్టర్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# 18న బీసీ బంద్

**రాహుల్, బండి, కిషన్ రెడ్డి మాట్లాడరెందుకు?**

**రిజర్వేషన్ల సాధన సమితి కమిటీ ఏర్పాటు చేయాలి**

**బీసీ సాధికారత సంఘం నేత పొలాస నరేందర్ వినతి**

సిరిసిల్ల/వేములవాడ, అక్టోబర్ 13 (ఈవార్తలు): బీసీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేయటాన్ని బీసీ సాధికారిత సంఘం స్వాగతిస్తుందని బీసీ సాధికారత సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ అన్నారు. అసెంబ్లీ బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లోనే ఉన్నాయని, ఆర్డినెన్స్ కూడా పెండింగ్‌లోనే ఉందని, చివరికి జీవో జారీ చేసినా.. కొందరు కోర్టు ద్వారా స్టే తెచ్చారని తెలిపారు. ఈ పర్యవసానాలతో బీసీల్లో నిరాశ ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం కోర్టులో న్యాయపోరాటం చేస్తూనే, కేంద్రంతో రాజకీయ పోరాటం చేయాలని సూచించారు. అఖిలపక్ష భేటీ, బీసీ జేఏసీ భేటీ ఏర్పాటు చేసి 'రిజర్వేషన్ల సాధన సమితి' పేరిట కమీటీ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌కు విజ్ఞప్తి చేశారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా రాహుల్ గాంధీ, బండి సంజయ్, కిషన్ రెడ్డి మాట్లాడరేందుకని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల సాధనకై ఈ నెల 18 న రాష్ట్ర బీసీ జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు.

# జోగి రమేశ్ చెబితేనే చేశా

**నిందితుడు జనార్ధన్ రావు**

అమరావతి, అక్టోబర్ 13 (ఈవార్తలు): నకిలీ మద్యం తయారీ కేసులో అరెస్టయిన నిందితుడు జనార్దన్ రావు.. మాజీ మంత్రి జోగి రమేశ్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్నది జోగి రమేశేనని, ఆయన ఆదేశాల మేరకే తాను నకిలీ మద్యం తయారు చేశానని ఒక వీడియో ద్వారా తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వంపై బురద జల్లేందుకే ఈ కుట్ర పన్నారని ఆయన ఆరోపించడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. జనార్దన్ రావు కథనం ప్రకారం, గత ప్రభుత్వ హయాంలోనే తాము నకిలీ మద్యం తయారు చేసినప్పటికీ, ప్రభుత్వం మారడంతో ఆపేశామని తెలిపారు. అయితే, టీడీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేందుకు జోగి రమేశ్ తమను మళ్లీ ప్రోత్సహించారని వెల్లడించారు. "ముందుగా ఇబ్రహీంపట్నంలో ప్లాన్ చేశాం. కానీ, చంద్రబాబుపై బురద జల్లాలంటే ఉమ్మడి చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె సరైన ప్రదేశమని జోగి రమేశ్ చెప్పారు. ఆర్థిక సాయం కూడా చేస్తామని హామీ ఇచ్చారు" అని జనార్ధన్ రావు వివరించారు. ఈ పథకంలో భాగంగా తనను ఆఫ్రికాలోని తన మిత్రుడి వద్దకు పంపించారని పేర్కొన్నారు. అయితే, ఈ వ్యవహారాన్ని బయటపెట్టింది కూడా జోగి రమేశేనని జనార్దన్ రావు ఆరోపించారు. "ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు తన మనుషులతోనే జోగి రమేశ్ లీక్ ఇచ్చారు. రైడ్‌కు ముందురోజు ఇబ్రహీంపట్నంలో సరుకు పెట్టించి, ఆ తర్వాత సాక్షి మీడియాకు సమాచారం ఇచ్చి రైడ్ చేయించారు.

# జగిత్యాల జిల్లాలో 1000 కోట్ల క్రిప్టో మోసాలు

**లాభాపేక్షతో పెట్టుబడి పెట్టి మోసపోవద్దు**

**ప్రజలకు మాజీమంత్రి జీవన్ రెడ్డి సూచనలు**



జగిత్యాల టౌన్, అక్టోబర్ 13 (ఈవార్తలు): క్రిప్టో మోసాల బారిన పడొద్దని ప్రజలకు మాజీమంత్రి జీవన్ రెడ్డి సూచించారు. అధిక లాభాపేక్షతో పెట్టుబడులు పెట్టి అమాయక ప్రజలు మోసపోతున్నారని, సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. సోమవారం ఇందిరాభవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఫేక్ యాప్‌ల ద్వారా అధిక లాభాపేక్షను ఎర చూపడంతో గ్రామీణ ప్రజలతో పాటు వివిధ హొదాల్లో ఉన్నవారు సైతం మెట్ ఫండ్, యు బిట్లలో చైన్ విధానంలో పెట్టుబడులు పెట్టి మోసపోతున్నారన్నారు. 'పెట్టుబడిదారులకు విదేశీ టూర్లు, లగ్జరీ వసతుల పేరిట అమాయక ప్రజలు ఆకర్షితులు అవుతున్నారు. గతంలో ఫైనాన్స్ కంపెనీలపై రెగ్యులేటరీ లేదు. ప్రస్తుతం క్రిప్టో కరెన్సీ పేరిట నకిలీ యాప్స్, వెబ్సైట్లు విస్తరించాయి. ఆర్బీఐ అనుమతులు లేకుండా చేపట్టే ఏ ఆర్థిక కార్యక్రమాలు అయినా చట్ట విరుద్ధమే. జగిత్యాల జిల్లాలోనే సుమారు రూ.1000 కోట్లు మోసపోయినట్లు లెక్కలు చెబుతున్నాయి. పెట్టుబడులు పెట్టినవారు ఏ విధమైన రశీదులు లేకుండానే పెట్టుబడులు పెడుతున్నారు. క్షణాల వ్యవధిలో యాప్స్ తొలగిస్తూ ఆధారాలు లేకుండా చేసేసరికి లబోదిబో మంటున్నారు. నకిలీ యాప్‌లలో పెట్టుబడులు పెట్టి మోసపోయిన వారు పోలీసుల దృష్టికి వచ్చేది ఒక్క శాతం కూడా లేదు. ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. అమాయక ప్రజలను పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించిన వారి ఆస్తులు జప్తు చేయాలి. పోలీసులు కేసులు నమోదు చేయడంతోపాటు రికవరీ చేస్తామనే విశ్వాసం బాధితుల్లో కల్పిస్తేనే ఫిర్యాదు చేసేందుకు ముందుకు వస్తారు. అనధికారిక ఆర్థిక కార్యకలాపాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ ప్రభావితం అవుతోంది. రాష్ట్ర పరిధిలో ఏ మేరకు నిలుపుదల చేస్తాం.. అని పరిశీలించి ఆర్థిక మోసాలు అరికట్టేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి' అని కోరారు.



# మానవత్వం చాటుకున్న సిరిసిల్ల ఎస్పీ

సిరిసిల్ల, అక్టోబర్ 13 (ఈవార్తలు): ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని పోలీస్ వాహనంలో ఆస్పత్రికి తరలించి సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బీ గీతే మానవత్వం చాటుకున్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని బైపాస్ లో ప్రమాదం గాయాలతో పడి ఉన్న వ్యక్తిని అటు వైపు వెళ్తున్న జిల్లా ఎస్పీ గమనించారు. తన వాహనాన్ని ఆపి పైలెట్ వాహనంలో హుటాహుటిన జిల్లా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తికి మంచి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



# రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ నేతల క్షీరాభిషేకం

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ వేములవాడ,అక్టోబరు 13(ఈ వార్తలు): వేములవాడ రాజన్న ఆలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి క్షీరాభిషేకం చేశారు. ఆలయ అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను బీజేపీ నేతలు దహనం చేయడంపై మండిపడుతూ, ప్రతిగా క్షీరాభిషేకం చేస్తున్నట్లు తెలిపారు. 'వేములవాడ రాజన్న ఆలయంపై రాజకీయం చేయవద్దు. రాజన్న ఆలయ అభివృద్ధిని అడ్డుకోవద్దు. అడ్డుకుంటే చరిత్రహీనులుగా మిగిలిపోతారు. ఆలయాన్ని రాజకీయ వేదికగా మార్చవద్దు. రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తే ఎందుకు బీజేపీ నాయకులు తట్టుకుంటలేరు. అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో భక్తులకు దర్శనం ఎలా సాధ్యం? ఎవరు అడ్డుపడినా ఆలయ అభివృద్ధి మాత్రం నిలిపే ప్రసక్తే లేదు. హిందూ ధర్మం అనే గొప్పగా చెప్పుకునే వారు హిందూ దేవాలయం అభివృద్ధి చెందితే వారికి బాధ ఏంది? రాజన్న ఆలయాన్ని బీసీ నాయకుడు అభివృద్ధి చేస్తే మీకు నచ్చడం లేదా?' అని ప్రశ్నించారు.



# ఎంఐఎం బలోపేతానికి కృషి

**కరీంనగర్ పార్టీ అధ్యక్షుడు వెల్లడి**

జగిత్యాల టౌన్, అక్టోబర్ 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో ఎంఐఎం బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎంఐఎం అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. సోమవారం పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన జగిత్యాల పట్టణ ఎంఐఎం కార్యవర్గాన్ని ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు రద్దు చేస్తున్నామన్నారు. జగిత్యాల పట్టణంలోని వివిధ వార్డుల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి, వార్డు కమిటీలను ఎన్నుకున్న అనంతరం జగిత్యాల పట్టణ ఎంఐఎం కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని తెలిపారు. ఎంఐఎం పార్టీ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. పట్టణంలో సభ్యత్వం ముగిసిన అనంతరం జగిత్యాల పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలకు సభ్యత్వ నమోదు పుస్తకాలను అందించారు. సమావేశంలో నాయకులు రఫీ, సుమేర్, రజీఉద్దీన్, అసద్, వాజిద్, నౌమాన్, అఫ్జల్, అనీస్, అమేర్ తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎస్ సంజయ్ బెయిల్ పిటిషన్ కొట్టివేత

విజయవాడ, అక్టోబర్ 13 (ఈవార్తలు): ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసులో అరెస్టయిన ఏపీ సీనియర్ ఐపీఎస్ అధికారి సంజయ్ కుమార్‌కు విజయవాడ ఏసీబీ కోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని ఆయన దాఖలు చేసుకున్న పిటిషన్‌ను న్యాయస్థానం తోసిపుచ్చింది. అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీ), సీఐడీ అదనపు డీజీగా సంజయ్ కుమార్ పనిచేసిన కాలంలో సుమారు రూ.1.5 కోట్ల ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టినట్లు విజిలెన్స్ విభాగం తన నివేదికలో పేర్కొంది. ఈ నివేదిక ఆధారంగానే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆయనపై కేసు నమోదు చేసి, గతంలో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన విజయవాడ జిల్లా జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు.

# పోలీస్ ఫ్లాగ్ డేకు వ్యాసరచన పోటీలు

**విద్యార్థులకు ఎస్పీ అశోక్ కుమార్ పిలుపు**



జగిత్యాల టౌన్, అక్టోబర్ 13 (ఈవార్తలు): పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాల స్మరణలో భాగంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం 'పోలీస్ ఫ్లాగ్ డే' నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా అమరులైన పోలీసు సిబ్బందిని స్మరించుకుంటూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీ నిర్వహించనున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఈ పోటీలు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో ఉంటాయని, 6వ తరగతి నుంచి పీజీ వరకు ఉన్న విద్యార్థులు పాల్గొనవచ్చని అన్నారు. విద్యార్థులు తమ వ్యాసాలను అక్టోబర్ 28లోగా సమర్పించాలని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని, జిల్లా స్థాయిలో 1వ, 2వ, 3వ స్థానాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చాలని సూచించారు. పాల్గొనేందుకు https://forms.gle/jaWLdt2yhNrMpe3eA క్లిక్ చేయాలని పేర్కొన్నారు.

# మెడ్‌ప్లస్, మారుతి సుజుకీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పనకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ నెల16న జిల్లా కేంద్రంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరగనున్నాయి. హైదరాబాద్‌లోని మెడ్‌ప్లస్‌లో 70 ఉద్యోగాలు, జగిత్యాలలోని మారుతి సుజుకీ సంస్థలో రెండు సెక్యూరిటీ గార్డుల పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి సత్యమ్మ పేర్కొన్నారు.



# కలెక్టరేట్‌లో సీపీఆర్‌పై అవగాహన

జగిత్యాల టౌన్, అక్టోబర్ 13 (ఈవార్తలు): కార్డియో పల్మనరి రిసాసిటేషన్ (సిపిఆర్ )వారోత్సవాలు అక్టోబర్ 13 నుంచి అక్టోబర్ 17వ తేదీ వరకు జరుగుతున్న సందర్భంగా జగిత్యాల కలెక్టరేట్‌లో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ కార్డియాక్ అరెస్ట్ వల్ల చాలా మంది యుక్త వయసులోనే మరణిస్తున్నారని, అందరూ సీపీఆర్‌పై అవగాహన ఉంటే, 10 శాతం ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) బీ రాజా గౌడ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్, ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాస్, జీవాకర్ రెడ్డి, ట్రైనీ అదనపు కలెక్టర్ కే హరిణి, జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మెటా ఫండ్ ప్రో కేసులో మరో ఇద్దరి అరెస్టు



జగిత్యాల టౌన్, అక్టోబర్ 13 (ఈవార్తలు): జగిత్యాలలో క్రిప్టో కరెన్సీ మెటా ఫండ్ ప్రో కేసులో మరో ఇద్దరు అరెస్ట్ అయ్యారు. బాధితులు పజిల్ అహ్మద్, విక్రమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాలకు చెందిన కస్తూరి శ్యాంసుందర్, హైదరాబాద్‌కు చెందిన వరాల వెంకటేశ్వరరావును అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. జగిత్యాలకు చెందిన పలువురి నుంచి రూ.2.3కోట్ల పెట్టుబడులు పెట్టించినట్లు తెలిసిందని అన్నారు. కస్తూరి శ్యాంసుందర్ వద్ద రూ.5.4 లక్షలు రికవరీ చేశామని, నిందితులను రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

# ఏపీ నకిలీ మద్యం కేసులో సిట్

అమరావతి, అక్టోబర్ 13 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన నకిలీ మద్యం కేసుపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు నలుగురు సీనియర్ అధికారులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తున్నట్టు సీఎం చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో వెలుగుచూసిన కల్తీ మద్యం ఘటనపై ఈ బృందం లోతుగా విచారణ చేపట్టనుంది. ఈ ప్రత్యేక దర్యాప్తు బృందానికి ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్‌ను చీఫ్‌గా నియమించారు. సిట్ సభ్యులుగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, సీఐడీ ఎస్పీ కె. చక్రవర్తి, టెక్నికల్ సర్వీసెస్ ఎస్పీ మల్లికా గార్గ్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

# ట్రంప్‌కు ఇజ్రాయెల్ ప్రెసిడెన్షియల్ మెడల్

**రెడ్ కార్పెట్ వెల్‌కమ్ పలికిన నెతన్యాహు**

**ప్రపంచానికి మరింత మంది ట్రంప్‌లు కావాలని వ్యాఖ్య**



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు ఇజ్రాయెల్ అత్యున్నత పురస్కారం ప్రకటించింది. ఈమేరకు 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఆనర్' ను ట్రంప్ కు అందించి గౌరవించనున్నట్లు ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఇస్సాక్ హెర్జోగ్ పేర్కొన్నారు. హమాస్ చెరలో రెండేళ్లుగా మగ్గుతున్న తమ పౌరులను విడిపించినందుకు గానూ ఆయనకు ఈ పురస్కారం ప్రకటించినట్లు తెలిపారు. రానున్న నెలల్లో సమయం, వేదిక నిర్ణయించి అందజేయనున్నట్లు తెలిపారు. గాజా ఒప్పందం కుదర్చడంలో, బందీల విడుదలలో ట్రంప్ చేసిన కృషిని ఇజ్రాయెల్ ప్రజలు తరతరాల పాటు గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. ట్రంప్ అవిశ్రాంత కృషి కారణంగానే హమాస్ చెరలో ఉన్న తమ పౌరులు నేడు తిరిగి వస్తున్నారని ఆనందం వ్యక్తంచేశారు. ఇజ్రాయెల్‌లోనే కాకుండా మధ్యప్రాచ్యంలో శాంతియుత భవిష్యత్తును నెలకొల్పడానికి ట్రంప్ పునాది వేశారని ఇస్సాక్ హెర్జోగ్ కొనియాడారు. కాగా, అంతకుముందు ఆయనకు ఇజ్రాయెల్ ప్రభుత్వం రెడ్ కార్పెట్ స్వాగతం పలికింది. ఆదివారం ఆ దేశ చట్టసభలో మాట్లాడిన ట్రంప్, "థ్యాంక్యూ వెరీమచ్ బేబీ, గొప్ప పని చేశావ్" అంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ప్రశంసించారు. ట్రంప్ ప్రసంగిస్తూ, మధ్యప్రాచ్యంలో సరికొత్త చరిత్ర ఆరంభమవుతోందని, ఈ పవిత్ర భూమిలో శాంతి నెలకొనడంతో ఆకాశం నిర్మలంగా మారిందని అన్నారు. ఈ ప్రాంతంలో తుపాకులు మూగబోయాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న స్వర్ణయుగం ఇజ్రాయెల్‌లో ప్రారంభమైందని, బందీలు తిరిగి రావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం విషయంలో తాము సమయం వృథా చేస్తున్నామని చాలామంది అభిప్రాయపడ్డారని, కానీ చివరకు విజయం సాధించామని ట్రంప్ అన్నారు. అమెరికా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బాధిత కుటుంబాలకు ఆయన భరోసా ఇచ్చారు. ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో మధ్యప్రాచ్యంలో అమెరికా ప్రత్యేక రాయబారిగా ఉన్న స్టీవ్ విట్కాఫ్, ఆయన సలహాదారు జేర్డ్ కుష్నర్ కీలక పాత్ర పోషించారని ట్రంప్ కొనియాడారు. ట్రంప్ ప్రసంగిస్తున్న సమయంలో కొందరు ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. "మారణహోమం" అంటూ నినాదాలు చేయడంతో వారిని సభ నుంచి బయటకు పంపించేశారు. ఈ నిరసనలపై సభాపతి ట్రంప్‌కు క్షమాపణ చెప్పారు.

**ప్రపంచానికి మరింతమంది ట్రంప్‌లు కావాలి**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇజ్రాయెల్ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది. ట్రంప్ వంటి వ్యక్తులు ప్రపంచానికి మరింత మంది అవసరమని ఆకాంక్షించింది. ఇజ్రాయెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదర్చడంలో కీలక పాత్ర పోషించినందుకు బెంజమిన్ నేతన్యాహు ప్రభుత్వం ట్రంప్‌కు ఘనంగా కృతజ్ఞతలు తెలిపింది. ఇజ్రాయెల్ చట్టసభ కనేసెట్ ఆయనకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చింది. వచ్చే సంవత్సరం నోబెల్ శాంతి బహుమతికి ఆయన పేరును ప్రతిపాదిస్తామని ఇజ్రాయెల్ ప్రభుత్వం వెల్లడించింది. ట్రంప్ ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్నారు. ఆ దేశ ప్రధాని నెతన్యాహుతో కలిసి జెరూసలెంలోని చట్టసభకు వెళ్లారు. ఇజ్రాయెల్ ప్రజాప్రతినిధులు ట్రంప్‌కు ఘన స్వాగతం పలికారు. కాల్పుల ఒప్పందం చేసినందుకు గాను లేచి నిలబడి రెండున్నర నిమిషాల పాటు చప్పట్లతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ ఒహనా మాట్లాడుతూ, బందీల విడుదలకు ట్రంప్ కృషి చేశారని కొనియాడారు. యూదు ప్రజలు ఆయనను వేల సంవత్సరాలు గుర్తు పెట్టుకుంటారని అన్నారు. ప్రపంచంలో శాంతిస్థాపన కోసం ఆయన ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ కంటే అర్హులు ప్రపంచంలో ఎవరూ లేరని అన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మాట్లాడుతూ, యుద్ధం ముగిసేలా గాజా ఒప్పందం చేసినందుకు ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ట్రంప్ తప్పకుండా నోబెల్ బహుమతి సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. కాగా, అంతకుముందు ట్రంప్, నెతన్యాహు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బంగారు పావురాన్ని ట్రంప్‌కు కానుకగా ఇచ్చారు.



## లాహెూర్‌లో ఉద్రిక్తత

**పోలీసులు, ఆందోళనకారుల మృతి**

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని లాహెూర్ నగరం రణరంగాన్ని తలపించింది. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా తెహ్రీక్-ఎ-లబ్బైక్ పాకిస్థాన్ (టీఎల్‌పీ) అనే ఇస్లామిక్ పార్టీ చేపట్టిన భారీ ర్యాలీ హింసాత్మకంగా మారింది. పోలీసులకు, నిరసనకారులకు మధ్య జరిగిన తీవ్ర ఘర్షణల్లో ఒక పోలీస్ అధికారి మరణించగా, అనేక మంది ప్రదర్శనకారులు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలతో లాహెూర్‌లో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. పాలస్తీనాకు మద్దతుగా ఇస్లామాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు టీఎల్‌పీ మద్దతుదారులు శుక్రవారం లాంగ్ మార్చ్ ప్రారంభించారు. ఇందులో భాగంగా ఈరోజు లాహెూర్‌లో పోలీసులు రోడ్లపై అడ్డుగా పెట్టిన కంటైనర్లను ఆందోళనకారులు తొలగించేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తతలు మొదలయ్యాయి. ఈ క్రమంలో నిరసనకారులు పోలీసులపై కాల్పులు జరిపారని, ఈ ఘటనలో ఒక అధికారి మరణించగా, మరికొందరు గాయపడ్డారని పంజాబ్ పోలీస్ చీఫ్ ఉస్మాన్ అన్వర్ తెలిపారు. అయితే, పోలీసుల కాల్పుల్లోనే తమ మద్దతుదారులు ఎంతోమంది చనిపోయారని, గాయపడ్డారని టీఎల్‌పీ వర్గాలు ఆరోపించాయి. ఈ ఘర్షణల్లో టీఎల్‌పీ పార్టీ అధినేత సాద్ రిజ్వీకి కూడా తీవ్రమైన బుల్లెట్ గాయాలయ్యాయని, ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని పార్టీ ఒక ప్రకటనలో వెల్లడించింది. గాయపడటానికి కొద్దిసేపటి ముందు విడుదలైన ఒక వీడియోలో, సాద్ రిజ్వీ కాల్పులు ఆపాలని భద్రతా బలగాలను కోరుతూ, చర్చలకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పడం కనిపించింది. ఆ సమయంలో కూడా కాల్పుల శబ్దాలు వినిపించాయి. ఈ హింసాత్మక ఘటనల్లో నిరసనకారులకు చెందిన పలు వాహనాలు దగ్ధమయ్యాయి. ఇప్పటికే శనివారం జరిగిన ఘర్షణలకు సంబంధించి పోలీసులు 100 మందికి పైగా ఆందోళనకారులను అరెస్టు చేశారు. గాజా యుద్ధం ముగిసి శాంతి నెలకొంటున్న సమయంలో టీఎల్‌పీ హింసకు దిగడాన్ని అర్థం చేసుకోలేకపోతున్నామని పాకిస్థాన్ ఉప అంతర్గత వ్యవహారాల మంత్రి తలాల్ చౌదరి వ్యాఖ్యానించారు.

# కుదేలైన సూచీలు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లలో రెండు రోజులుగా కొనసాగుతున్న లాభాల జోరుకు సోమవారం అడ్డుకట్ట పడింది. బలహీన అంతర్జాతీయ సంకేతాలు, ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీయడంతో సూచీలు నష్టాలతో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 173.77 పాయింట్లు (0.21%) క్షీణించి 82,327.05 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 58 పాయింట్లు (0.23%) నష్టపోయి 25,227.35 వద్ద ముగిసింది. చైనాపై కఠినమైన సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మార్కెట్లను కలవరపెట్టాయి. మళ్లీ అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మొదలవుతుందనే భయాలు ఇన్వెస్టర్లలో అమ్మకాలకు దారితీశాయి. ఆదివారం నాటికి ట్రంప్ తన వైఖరిని కొంత సడలించినప్పటికీ, మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. దీనికి తోడు అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్, ఇటీవలి ర్యాలీల తర్వాత లాభాల స్వీకరణ వంటి అంశాలు కూడా మార్కెట్లపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. సెన్సెక్స్‌లో ప్రధానంగా టాటా మోటార్స్, ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్), పవర్ గ్రిడ్ షేర్లు నష్టపోయి సూచీని కిందకు లాగాయి. మరోవైపు అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభపడి నష్టాలను కొంతవరకు పరిమితం చేశాయి. రంగాలవారీగా చూస్తే, ఐటీ, ఎఫ్ఎంసీజీ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 0.78%, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ ఇండెక్స్ 0.9% మేర నష్టపోయాయి. అయితే, వీటికి భిన్నంగా నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండెక్స్ 0.35% లాభపడింది. బ్రాడర్ మార్కెట్‌లో మిశ్రమ స్పందన కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 స్వల్పంగా 0.11% లాభపడగా, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.17% నష్టపోయింది. "నిఫ్టీ 25,000 కీలక మద్దతు స్థాయి పైన ఉన్నంతవరకు మార్కెట్ ట్రెండ్ సానుకూలంగానే ఉంటుంది. సూచీ 25,500 నిరోధక స్థాయికి చేరే అవకాశం ఉంది" అని మార్కెట్ నిపుణులు అంచనా వేశారు. అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతల కారణంగా సమీప భవిష్యత్తులో మార్కెట్లు ఒడుదొడుకులకు లోనయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

# పీకే రెండో జాబితా విడుదల

**మొత్తం 116 స్థానాలకు ప్రకటన**




పాట్నా: రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) బీహార్ రాజకీయాల్లో ఆసక్తికరమైన చర్చకు తెరలేపారు. ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌పై రాఘోపూర్ నుంచి పోటీ చేస్తానని గతంలో ప్రకటించిన ఆయన, తన జన్ సురాజ్ పార్టీ తరఫున ఈరోజు విడుదల చేసిన రెండో జాబితాలో కూడా తన పేరును చేర్చలేదు. ఇది రాజకీయ వర్గాల్లో ఊహాగానాలకు తావిస్తోంది. జన్ సురాజ్ పార్టీ ఈరోజు 65 మంది అభ్యర్థులతో కూడిన రెండో జాబితాను విడుదల చేసింది. ఇందులో 20 రిజర్వ్ స్థానాలకు (19 ఎస్సీ, 1 ఎస్టీ), 45 జనరల్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇస్తూ, అన్ని వర్గాలకు అవకాశం కల్పించినట్లు పార్టీ వెల్లడించింది. ఈ జాబితాలో అత్యంత వెనుకబడిన తరగతుల నుంచి 14 మంది, ఇతర వెనుకబడిన తరగతుల నుంచి 10 మంది, రిజర్వ్ వర్గాల నుంచి 11 మంది, మైనారిటీల నుంచి 14 మందికి చోటు కల్పించారు. ముఖ్యంగా, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు ఒకప్పుడు కంచుకోటగా ఉన్న హర్నాట్ స్థానం నుంచి కమలేశ్ పాశ్వాన్ అనే ఎస్సీ అభ్యర్థిని బరిలోకి దింపడం గమనార్హం. ఈ సందర్భంగా పీకే మాట్లాడుతూ.. రెండో జాబితాతో కలిపి ఇప్పటివరకు మొత్తం 116 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినట్లు తెలిపారు. "తొలి జాబితాలో 51 మందిని, ఇప్పుడు 65 మందిని ప్రకటించాం. మిగిలిన స్థానాలకు త్వరలోనే అభ్యర్థులను ప్రకటిస్తాం" అని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు ప్రకటించిన అభ్యర్థుల్లో 31 మంది అత్యంత బలహీన వర్గాలకు, 21 మంది ఓబీసీలకు, 21 మంది ముస్లింలకు చెందిన వారని ఆయన వివరించారు. అక్టోబర్ 9న విడుదల చేసిన 51 మందితో కూడిన తొలి జాబితాలోనే జన్ సురాజ్ పార్టీ పలువురు ప్రముఖులకు చోటు కల్పించింది. మాజీ కేంద్ర మంత్రి ఆర్.సి.పి. సింగ్ కుమార్తె లతా సింగ్, ప్రముఖ సోషలిస్ట్ నేత కర్పూరి ఠాకూర్ మనవరాలు జాగృతి ఠాకూర్, భోజ్‌పురి గాయకుడు రితేష్ పాండే, ప్రముఖ గణిత శాస్త్రవేత్త కె.సి. సిన్హా వంటి వారు మొదటి జాబితాలో ఉన్నారు. బీహార్‌లోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈసారి ఎన్నికలు ఎన్డీయే, ఇండియా కూటములతో పాటు ప్రశాంత్ కిశోర్ జన్ సురాజ్ పార్టీ మధ్య త్రిముఖ పోరుగా మారే అవకాశం కనిపిస్తోంది.



## 9 నెలల్లో లక్ష కార్లు సేల్

**భారత్‌లో 'విన్‌ఫాస్ట్' ప్రభంజనం.. సెప్టెంబర్‌లో 13,914 యూనిట్ల అమ్మకం**

తూత్తుకుడి/న్యూఢిల్లీ: భారత ఆటోమొబైల్ రంగంలో వియత్నాంకు చెందిన ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) తయారీ సంస్థ విన్‌ఫాస్ట్ సరికొత్త చరిత్ర సృష్టించింది. కేవలం 9 నెలల వ్యవధిలోనే లక్షకు పైగా కార్లను విక్రయించి సంచలనం రేపింది. ఒకే ఏడాది మొదటి మూడు త్రైమాసికాల్లోనే ఈ ఘనత సాధించిన తొలి కార్ల బ్రాండ్‌గా నిలిచినట్లు కంపెనీ సోమవారం అధికారికంగా ప్రకటించింది. వివరాల్లోకి వెళితే, సెప్టెంబర్ నెలలో విన్‌ఫాస్ట్ 13,914 ఎలక్ట్రిక్ వాహనాలను విక్రయించింది. దీంతో ఈ ఏడాదిలో ఇప్పటివరకు అమ్ముడైన మొత్తం కార్ల సంఖ్య 1,03,884కు చేరింది. భారత ఆటోమొబైల్ చరిత్రలోనే ఇది ఒక రికార్డు అని కంపెనీ తన ప్రకటనలో పేర్కొంది. గత 11 నెలలుగా దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న కార్ల బ్రాండ్‌గా విన్‌ఫాస్ట్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. భారత మార్కెట్‌పై భారీ అంచనాలతో ఉన్న ఈ వియత్నాం కంపెనీ, తన కార్యకలాపాలను వేగంగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా తమిళనాడులోని తూత్తుకుడిలో భారీ అసెంబ్లీ ప్లాంట్‌ను ప్రారంభించింది. ఈ ప్లాంట్‌పై దశలవారీగా రూ. 16,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనుంది. తొలి దశలో భాగంగా, ఈ ప్లాంట్‌లో ఏటా 50,000 ప్రీమియం ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ మోడళ్లు అయిన వీఎఫ్ 6, వీఎఫ్ 7 లను అసెంబుల్ చేయనున్నారు. ఈ విజయంపై విన్‌ఫాస్ట్ గ్లోబల్ డిప్యూటీ సీఈఓ (సేల్స్ అండ్ మార్కెటింగ్) డ్యాంగ్ థీ థు ట్రాంగ్ మాట్లాడుతూ, "మాపై నమ్మకం ఉంచిన వినియోగదారులకు మేము కృతజ్ఞతలు తెలుపుతున్నాము. వారికి మరింత విలువైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నాం" అని తెలిపారు. కంపెనీ అమ్మకాల్లో వియత్నాం 'జాతీయ ఎలక్ట్రిక్ కారు'గా పిలిచే వీఎఫ్ 3 మోడల్ 31,386 యూనిట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో వీఎఫ్ 5 (30,956 యూనిట్లు), వీఎఫ్ 6 (14,425 యూనిట్లు) ఉన్నాయి. దేశవ్యాప్తంగా తన ఉనికిని పటిష్టం చేసుకునేందుకు ఈ ఏడాది చివరి నాటికి 27 నగరాల్లో 35 డీలర్‌షిప్‌లను ప్రారంభించాలని విన్‌ఫాస్ట్ లక్ష్యంగా పెట్టుకుంది.

TATA CAPITAL
Count on us

## టాటా క్యాపిటల్ ఒక్కో షేరు రూ.310

ముంబై: టాటా క్యాపిటల్ సాదాసీదాగా దలాల్ స్ట్రీట్ లోకి ఎంట్రీ ఇచ్చి, ఇన్వెస్టర్లను నిరాశకు గురిచేసింది. ఇటీవలి కాలంలో అతిపెద్ద ఐపీఓ కావడంతో టాటా క్యాపిటల్ లిస్టింగ్ పై భారీగా అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో సోమవారం టాటా క్యాపిటల్ లిస్టింగ్ కాగా.. పబ్లిక్ ఇష్యూ ధరతో పోలిస్తే కేవలం ఒక శాతం ప్రీమియంతోనే షేర్లు అరంగేట్రం చేయడంతో ఇన్వెస్టర్లకు నిరాశ తప్పలేదు. ఐపీఓలో టాటా క్యాపిటల్ షేర్ ధరను రూ.310, రూ.326 మధ్య నిర్ణయించిన సంగతి తెలిసిందే. తాజాగా టాటా క్యాపిటల్ బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో రూ.330 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. 2007లో వాణిజ్య సేవలను ప్రారంభించిన టాటా క్యాపిటల్.. వేతన జీవులకు, స్వయం ఉపాధి పొందే వ్యక్తులకు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపారులకు, కార్పొరేట్లకు రుణాలు అందిస్తోంది. 2025 మార్చి 31 వరకు టాటా క్యాపిటల్ కంపెనీ కస్టమర్ల సంఖ్య 70 లక్షలకు చేరింది. ఈ క్రమంలోనే టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. ఐపీఓ ద్వారా సేకరించిన నిధులను టైర్-1 క్యాపిటల్ బేస్‌ను బలోపేతం చేయడానికి, భవిష్యత్ క్యాపిటల్ అవసరాలకు వినియోగించనున్నట్లు కంపెనీ పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో టాటా క్యాపిటల్ రూ.3,655 కోట్లు, అంతకుముందు ఏడాది రూ.3,327 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. కంపెనీ ఆదాయం కూడా రూ.18,175 కోట్ల నుంచి రూ.28,313 కోట్లకు పెరిగింది.

# ఐఆర్‌సీటీసీ స్కాంలో లాలూ ఫ్యామిలీ

**అభియోగాల నమోదుకు ఢిల్లీ కోర్టు గ్రీన్ సిగ్నల్**

**అవినీతి, క్రిమినల్ కుట్ర, మోసం వంటి తీవ్రమైన ఆరోపణలు**



న్యూఢిల్లీ: రైల్వే శాఖలో కలకలం రేపిన ఐఆర్‌సీటీసీ కుంభకోణం కేసులో రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుటుంబ సభ్యులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో లాలూతో పాటు ఆయన భార్య రబ్రీ దేవి, కుమారుడు తేజస్వి యాదవ్‌లపై ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు సోమవారం అభియోగాలను నమోదు చేసింది. దీంతో వారిపై విచారణ ప్రారంభానికి మార్గం సుగమమైంది. ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే ఈ కేసులో నిందితులపై అవినీతి, క్రిమినల్ కుట్ర, మోసం వంటి పలు అభియోగాలను ఖరారు చేశారు. లాలూ ప్రసాద్ యాదవ్‌పై అవినీతి, కుట్ర, మోసం అభియోగాలు నమోదు కాగా, రబ్రీ దేవి, తేజస్వి యాదవ్‌లపై కుట్ర, మోసం వంటి ఆరోపణలు నమోదయ్యాయి. న్యాయమూర్తి అభియోగాలను చదివి వినిపించగా, నిందితులందరూ తాము నిర్దోషులమని తెలిపారు. తమపై మోపిన అభియోగాలను అంగీకరించబోమని, విచారణను ఎదుర్కొంటామని కోర్టుకు స్పష్టం చేశారు. దీంతో కేసు విచారణ దశకు చేరుకుంది. లాలూ ప్రసాద్ యాదవ్ 2004 నుంచి 2009 మధ్య కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఈ కుంభకోణం జరిగిందని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఆరోపిస్తోంది. ఐఆర్‌సీటీసీకి చెందిన రాంచీ, పూరీలలోని రెండు హెూటళ్లను సుజాత హెూటల్స్ అనే ప్రైవేట్ సంస్థకు అప్పగించేందుకు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని సీబీఐ పేర్కొంది. ఈ కాంట్రాక్టులకు బదులుగా, లాలూ కుటుంబ సభ్యులకు సంబంధించిన ఒక కంపెనీకి కోట్ల రూపాయల విలువైన భూమిని చాలా తక్కువ ధరకు బదిలీ చేశారని ప్రధాన ఆరోపణ. అయితే, యాదవ్ కుటుంబం ఈ ఆరోపణలను మొదటి నుంచి ఖండిస్తోంది. తమపై ఎలాంటి ఆధారాలు లేవని, కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ కేసును బనాయించారని వారు వాదిస్తున్నారు. ఈ కేసులో లాలూ కుటుంబంతో పాటు, కేంద్ర మాజీ మంత్రి ప్రేమ్ చంద్ గుప్తా భార్య సరళా గుప్తా, సుజాత హెూటల్స్ డైరెక్టర్లు విజయ్ కొచ్చర్, వినయ్ కొచ్చర్ తదితరులు కూడా నిందితులుగా ఉన్నారు.

## కోల్డ్‌రిఫ్ కంపెనీ మూసివేత

చెన్నై: కోల్డ్‌రిఫ్ దగ్గు మందు తయారీ సంస్థ శ్రేసన్ ఫార్మా అనుమతులను తమిళనాడు ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు అనుమతులు రద్దు చేసినట్లు తమిళనాడు డ్రగ్స్ కంట్రోల్ విభాగం వెల్లడించింది. కంపెనీ మూసివేతకు కూడా ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపింది. రాష్ట్రంలోని ఇతర ఔషధ తయారీ సంస్థల్లో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించినట్లు పేర్కొంది. కోల్డ్‌రిఫ్ దగ్గు మందు కారణంగా మధ్యప్రదేశ్‌లో 20 మందికి పైగా చిన్నారులు మరణించారు. ఇది దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ దగ్గు మందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రేసన్ ఫార్మా యూనిట్ తయారు చేసింది. మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీలు నిర్వహించగా సిరప్‌లో 48.6 శాతం అత్యంత విషపూరితమైన డైఇథైలిన్ గ్లైకాల్ ఉందని తెలిసినట్లు అధికారులు తెలిపారు. సరైన తయారీ పద్ధతులు అవలంబించలేదని, 300కు పైగా ఉల్లంఘనలను రికార్డు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రత్యేక దర్యాప్తు బృందం ఇప్పటికే కంపెనీ యజమానిని అరెస్టు చేసింది. ఈరోజు ఉదయం ఫార్మా సంస్థకు చెందిన పలు ప్రాంగణాల్లో ఈడీ తనిఖీలు నిర్వహించింది. దగ్గు మందు మరణాలకు తమిళనాడు అధికారుల నిర్లక్ష్యమే కారణమని దర్యాప్తులో భాగంగా కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ గుర్తించినట్లు మీడియా కథనాలు వచ్చాయి. రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థ నిబంధనలను విస్మరించిందని, కేంద్రం చేసిన సిఫార్సులకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంలో విఫలమైందని తేలింది.

## బెంగాల్ వరదలకు భూటాన్ కారణం

**ఆ దేశం నష్టపరిహారం చెల్లించాలి**

**బెంగాల్ సీఎం మమతా బెనర్జీ డిమాండ్**



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌ను అతలాకుతలం చేసిన వరదల విషయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పొరుగు దేశమైన భూటాన్‌పై సంచలన ఆరోపణలు చేశారు. భూటాన్ నుంచి ఆకస్మికంగా వెల్లువెత్తిన నీటి ప్రవాహం వల్లే తమ రాష్ట్రంలో తీవ్ర నష్టం వాటిల్లిందని, దీనికి ఆ దేశమే బాధ్యత వహించి నష్టపరిహారం చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. జల్‌పాయిగుడీ జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆమె, సహాయక చర్యలను సమీక్షించిన అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారు. వరద బాధితులకు అవసరమైన అన్ని సహాయక, పునరావాస కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా చూసుకుంటోందని మమతా బెనర్జీ స్పష్టం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదని ఆమె ఆరోపించారు. భారత్, భూటాన్ మధ్య ఒక ఉమ్మడి నదీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, అందులో పశ్చిమ బెంగాల్‌ను కూడా భాగస్వామిని చేయాలని తాము చాలా కాలంగా కోరుతున్నామని గుర్తుచేశారు. తమ ఒత్తిడి ఫలితంగానే ఈ నెల 16న కేంద్ర ప్రభుత్వం ఒక సమావేశానికి ఏర్పాట్లు చేసిందని, దీనికి రాష్ట్ర అధికారులు హాజరవుతారని తెలిపారు. ఇటీవల డార్జిలింగ్, జల్‌పాయిగుడీ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటంతో తీవ్ర విధ్వంసం జరిగింది. ఈ ప్రకృతి వైపరీత్యాల కారణంగా సుమారు 32 మంది ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. పొరుగున ఉన్న నేపాల్, భూటాన్‌లలోనూ భారీ వర్షాల వల్ల నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. మమతా బెనర్జీ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించడం ఇది రెండోసారి.

వయ్యారి చిత్రం



అనన్య పాండే




## రవితేజ బయోపిక్ తీయాలనుకున్నా: సిద్ధు

ప్రముఖులపై బయోపిక్ లు చేయడం కొన్నేళ్లుగా సినిమా రంగంలో ట్రెండ్ గా మారింది. ఇలా మాహానటి సావిత్రి జీవిత కథను తెరకెక్కించి సూపర్ సక్సెస్ అయ్యారు దర్శకుడు నాగ్ అశ్విన్. ఆ తర్వాత తెలుగులో పలువురు ప్రముఖుల బయోపిక్ లు వచ్చాయి కానీ, అవి అంతగా విజయం సాధించలేదు. అయితే మళ్లీ ఈ బయోపిక్ ల టాపిక్ తెరపైకి రావడానికి కారణం యంగ్ హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా తెలుసు కదా ప్రమోషన్స్ లో భాగంగా రీసెంట్ గా మాస్ మహారాజ రవితేజ తో ఇంటర్వ్యూ చేశారు. ఈ ఇంటర్వ్యూలో సిద్ధు.. తనకు రవితేజ అంటే ఇష్టం అని చెప్పాడు. అలాగే ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా అసిస్టెంట్ డైరెక్టర్, చిన్న చిన్న పాత్రల నుంచి హీరోగా ఎదిగారు రవితేజ. అలా ఆయన ఇండస్ట్రీలోకి వచ్చి హీరోగా ఎదిగిన తీరును బయోపిక్ గా తీసి తెరకెక్కించాలని ఒకప్పుడు సిద్ధు భావించారట. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ఇంటర్వ్యూలో చెప్పారు. తన సినిమా కృష్ణ అండ్ హీజ్ లీల సినిమా తర్వాత రవితేజ బయోపిక్ చేయాలని గట్టిగా ప్లాన్ చేశారట. కొన్ని రోజులు దీనిపై పని చేశారట. కానీ, ఆ తర్వాత కొన్ని కారణాల వల్ల ప్లాన్ విరమించుకున్నానని సిద్ధు చెప్పారు. అయితే ఇది విన్న రవితేజ కూడా బయోపిక్ లపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. బయోపిక్స్ సినిమాల్లో ఒక మనిషికి సంబంధించిన అన్ని అంశాలు చూపించాలి. కానీ ఇక్కడ పాజిటివ్ కోణంలోనే ఉంటున్నాయి. అలా కాకుండా ఆ మనిషిలోనీ నెగెటివ్స్ కోణాన్ని కూడా చూపించాలి అని రవితేజ అన్నారు. అలాగే తాను కూడా ఒక నటుడి బయోపిక్ తెరెకెక్కించాలని అనుకున్నారట. ఎవరి బయోపిక్ అని అడగ్గా.. తాను ఆ నటుడు ఎవరో చెప్పలేదు.

## ఐటమ్స్‌కు అంత ఖర్చెందుకు?



ప్రతి సినిమాలో ఒక ఐటమ్ సాంగ్ ఉండాలని నిర్మాతలు డిమాండ్ చేస్తుంటారు. దానికోసం ఎంతైనా ఖర్చు చేస్తారు. ఐటమ్ గర్ల్ అందాల ఆరబోత కోసం కోట్లు ఖర్చు చేసేందుకు వెనుకాడరు. అయితే, సినిమాలో కథకు పంటి కింద రాయిలా మారిన ఈ సాంగ్స్‌కు అంత ఖర్చు అవసరమా? అన్న చర్చ మొదలైంది. గేమ్ ఛేంజర్, కింగ్ డమ్‌తో పాటు రీసెంట్‌గా వచ్చిన మిరాయ్, ఓజీ సినిమాల్లో కూడా సినిమా ఫ్లోని బ్రేక్ చేస్తుందని భారీగా ఖర్చు పెట్టిన సాంగ్‌ను సైతం పక్కన పెట్టారు. ఐతే ఆ సాంగ్స్ వల్ల సినిమాకు నష్టం వస్తుందా? అని అనుకున్నారు. కానీ ఆ సాంగ్ కోసమే సినిమాకు వచ్చిన వాళ్లు ఉంటారన్న విషయాన్ని గుర్తించట్లేదు. హిట్టైతే ఆ సాంగ్స్ ని యాడ్ చేస్తున్నారు కానీ ఫ్లాపైతే మాత్రం లైట్ తీసుకుంటున్నారు. ప్రస్తుతం ప్రభాస్ రాజా సాబ్ సినిమా కోసం కూడా యూరప్ లో రెండు సాంగ్స్ షూట్ కి చిత్ర యూనిట్ వెళ్లారు. అక్కడ కాస్ట్ లీ లొకేషన్స్ లో భారీగా ఖర్చు చేసి మరీ ఆ సాంగ్ ని చేస్తున్నారట. ఐతే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన మిరాయ్ సినిమాలోనే వైబ్ ఉంది బేబీ సాంగ్ సినిమాలో స్కిప్ చేశారు. ఆ తర్వాత సినిమా సక్సెస్ అయిన వారానికి యాడ్ చేశారు. రాజా సాబ్ ఒక హర్రర్ థ్రిల్లర్ మూవీ.. ఆ సినిమాలో సాంగ్స్ అనేవి డిఫరెంట్ గా ప్లాన్ చేయాలి. ఈ విషయంలో మారుతి ఆలోచన ఏమో కానీ ఇప్పుడు ఇంత ఖర్చు పెట్టి తీసిన సాంగ్స్ సినిమాలో పెడతారా లేదా అన్న అనుమానం వస్తోంది.



## బేబమ్మ కెరీర్ ట్రాక్‌లో పడేనా?

ఉప్పెన సినిమాతో టాలీవుడ్ లో తొలి సినిమాతోనే పాపులర్ అయ్యింది కృతి శెట్టి. ఆ సినిమా తర్వాత శ్యాం సింగ రాయ్, బంగార్రాజు సినిమాలు సక్సెస్ వచ్చినా ఆ తర్వాత మొదలైంది అసలు సినిమా. అప్పటి నుంచి లాస్ట్ ఇయర్ వచ్చిన మనమే వరకు కూడా కృతి శెట్టి సినిమా అంటే అది ఫ్లాపే అన్న విధంగా రిజల్ట్ ఉండేది. తెలుగులో స్టార్ డం వస్తే ఆ ఇంపాక్ట్ పాన్ ఇండియా లెవెల్ లో ఉంటుందని గుర్తించి ఇక్కడ అవకాశాల కోసం ఎదురుచూస్తుంది అమ్మడు. ఐతే ఈలోగా కోలీవుడ్ నుంచి ఆఫర్స్ రాగా, అటువైపు మళ్లింది. ప్రస్తుతం 3 సినిమాలు అమ్మడు చేతిలో ఉన్నాయి. వీటిలో ఏది వర్క్ అవుట్ అయినా అమ్మడికి మరిన్ని అవకాశాలు వస్తాయి. ఒకవేళ తేడా వస్తే మాత్రం ఇక కెరీర్ చాలా రిస్క్ లో పడినట్టు అవుతుంది.

## రుక్మిణీ వసంత్‌కు నేషనల్ క్రష్ ట్యాగ్!



నేషనల్ క్రష్ అంటే చాలు.. ఎవరికైనా రష్మిక మందన్న పేరు వెంటనే గుర్తుకొస్తుంది. నార్త్ టు సౌత్.. వరుసగా బ్లాక్ బస్టర్ హిట్స్ తో దూసుకుపోతున్న అమ్మడు.. కొన్నాళ్లుగా నేషనల్ ట్యాగ్ తో సందడి చేస్తోంది. ఇప్పుడు ఆ ట్యాగ్ షిఫ్ట్ అవుతుందా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. సోషల్ మీడియాలో ఇప్పుడు ఇదే ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. తన అందం, అభినయంతో ప్రేక్షకుల్ని మెప్పించిన అమ్మడు.. ఇప్పుడు ఓ రేంజ్ లో దూసుకెళ్తున్నారు. వరుస ఛాన్సులు అందుకుని జోరు మీద ఉన్న ఆమె.. త్వరలోనే జూనియర్ ఎన్టీఆర్ మూవీతో టాలీవుడ్ లోకి రానున్నారు. రీసెంట్ గా రిలీజ్ అయ్యి బ్లాక్ బస్టర్ గా నిలిచిన కాంతార చాప్టర్ 1లో యువరాణి పాత్రలో అదరగొట్టారు. కనకవతిగా అమ్మడి యాక్టింగ్ కు అంతా ఫిదా అయ్యారు. యువరాణిగా చూపించిన గాంభీర్యానికి అట్రాక్ట్ అయ్యారు. క్లైమాక్స్ లో తనలోని టాలెంట్ మొత్తాన్ని బయటపెట్టి ఒక్కసారిగా తనవైపునకు అందరి దృష్టిని తిప్పుకుంది. దీంతో ఇప్పుడు అంతా ఆమెను నేషనల్ క్రష్ అని పిలుస్తున్నారు.

## రామ్‌ను ఆకాశానికెత్తేసిన భాగ్యశ్రీ



రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే కాంబినేషన్లో తెరకెక్కిన తాజా మూవీ ఆంధ్రా కింగ్ తాలూకా.. నవంబర్ 28న విడుదల కాబోతోంది. ఈ సినిమాపైనే తన ఆశలన్నీ పెట్టుకున్నాడు. ఎలాగైనా హిట్టు కొట్టాలని చూస్తున్న రామ్ పోతినేని కష్టాన్ని పొగుడుతూ.. భాగ్యశ్రీ పెట్టిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ప్రియమైన రామ్.. సాగర్ పాత్రలో మీరు చేసే మ్యాజిక్ ని ఎక్స్పీరియన్స్ చేయడానికి ప్రేక్షకులు వేచి ఉండలేకపోతున్నారు. మీరు ఈ సినిమా కోసం చేసిన కృషి, హార్డ్ వర్క్ కి నేను ఆశ్చర్యపోతున్నాను. ఆంధ్రా కింగ్ తాలూకా మీ అభిమానుల అతిపెద్ద విజయం' అంటూ పోస్ట్ పెట్టింది.



## ఫ్యాషన్ అంటే.. ప్రియాంకనే

గ్లోబల్ స్టార్గా పేరు సొంతం చేసుకున్న ప్రియాంక చోప్రా కూడా సరికొత్త ఫ్యాషన్ దుస్తులతో దర్శనమిచ్చింది. దివాళీ సెలబ్రేషన్స్ లో భాగంగా ఈమె ధరించిన దుస్తులు మరింత అట్రాక్ట్ గా నిలుస్తున్నాయి. అందాలను చున్నీతో కవర్ చేస్తూ.. సిల్వర్ వైట్ కాంబినేషన్ లో చంకీలతో అత్యద్భుతంగా డిజైన్ చేసిన ఫాంట్, కోర్టు ధరించి ఉదర భాగాన్ని హైలెట్ చేస్తూ ఫోటోలను షేర్ చేసింది. తాజాగా ప్రియాంక చోప్రా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ మారుతున్నాయి. ఏది ఏమైనా ప్రియాంక చోప్రా ధరించిన ఈ సరికొత్త ఫ్యాషన్ దుస్తులు అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నాయి.

## మాకూ బ్రేక్ కావాలి: శాలినీ

బాలీవుడ్ హీరోయిన్ దీపికా పడుకోన్ 8 గంటల పని విధానంపై సందీప్ రెడ్డి వంగా హీరోయిన్ శాలినీ పాండే స్పందించింది. దీపికాకు సపోర్ట్ చేస్తూ ఆసక్తికర కామెంట్స్ చేసింది. 'దీపికను తొలగించిన ప్రాజెక్టలలో ఏం జరిగిందో నాకు తెలియదు. కానీ, ఆమె అంటే నాకు చాలా ఇష్టం. స్కూల్‌లో చదువుకునేటప్పటి నుంచి ఆమెను చూస్తున్నాను. ఆమె గొప్ప యాక్టర్. దీపికకు ఏది అవసరమో అది నిర్భయంగా మాట్లాడుతుంది. తన వల్లే మేమంతా మానసిక ఆరోగ్యం గురించి మాట్లాడగలుగుతున్నాం. మేమూ మనుషులమే. మాక్కూడా చిన్నపాటి బ్రేక్ కావాలి. దీపిక డిమాండ్ చేస్తున్నది ఆమెకు దక్కాలి. అందులో తప్పేముంది' అని తెలిపింది.









# విసిగించిన విండీస్

### కాంప్‌బెల్, షైహోప్ సెంచరీలు

### రెండో ఇన్నింగ్స్‌లో 390 ఆలౌట్

### ఇంకో 58 రన్స్ చేస్తే భారత్ గెలుపు

వెస్టిండీస్‌తో రెండో టెస్ట్‌లో టీమిండియా విజయం ముంగిట నిలిచింది. 121 పరుగుల లక్ష్యచేధన కోసం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో వికెట్ నష్టానికి 63 పరుగులు చేసింది. విజయానికి మరో 58 పరుగుల దూరంలో నిలిచింది. క్రీజులో కేఎల్ రాహుల్(25 బ్యాటింగ్)తో పాటు సాయి సుదర్శన్(30 బ్యాటింగ్) ఉన్నాడు. దూకుడుగా ఆడే క్రమంలో వారికన్ బౌలింగ్‌లో యశస్వి జైస్వాల్(8) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. అంతకుముందు 173/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 390 పరుగులకు ఆలౌటైంది.

జాన్ కాంప్‌బెల్(199 బంతుల్లో 12 ఫోర్లు, 3 సిక్స్‌లతో 115), షైహోప్(214 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్స్‌లతో 103) సెంచరీలతో చెలరేగగా.. జస్టిన్ గ్రీవ్స్(85 బంతుల్లో 3 ఫోర్లతో 50 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించాడు. జైడెన్స్ సీల్స్(32)తో కలిసి జస్టిన్ గ్రీవ్స్ ఆఖరి వికెట్‌కు 79 పరుగులు జోడించాడు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా(3/44), కుల్దీప్ యాదవ్(3/104) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్(2/43) రెండు వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్‌కు చెరో వికెట్ దక్కింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 518/5 భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేయగా.. వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 248 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. వెస్టిండీస్‌ను ఆలౌట్ చేసేందుకు భారత బౌలర్లు చెమటోడ్చారు. ముఖ్యంగా జాన్ కాంప్‌బెల్, షైహోప్ జోడీని విడదీసేందుకు తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. తొలి ఇన్నింగ్స్‌లో 81.5 ఓవర్లు బౌలింగ్ చేసిన భారత బౌలర్లు తీవ్రంగా అలసి పోయారు. పిచ్ కూడా పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలంగా మారడం విండీస్‌కు కలిసొచ్చింది. కాంప్‌బెల్ కెరీర్‌లో తొలి సెంచరీ సాధించాడు. సెంచరీ అనంతరం కాంప్‌బెల్‌ను జడేజా వికెట్ల ముందు బోల్తా కొట్టించడంతో వెస్టిండీస్ 252/3 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో షైహోప్ 204 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతన్ని మహమ్మద్ సిరాజ్ క్లీన్ బౌల్డ్ చేయడంతో విండీస్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. రోస్టన్ చేజ్(40), టెవిన్ ఇమ్లాచ్(12), ఖారీ పీర్రె(0)లను కుల్దీప్ యాదవ్ ఔట్ చేయగా.. జోమెల్ వార్రికన్(3), అండర్సన్ ఫిలిప్(2)లను బుమ్రా పెలియన్ చేర్చాడు. ఈ పరిస్థితుల్లో జైడెన్ సీల్స్‌తో కలిసి జస్టిన్ గ్రీవ్స్ పోరాడాడు. దాంతో విండీస్ 361/9 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లోనూ ఈ జోడీ సాధికారికంగా ఆడింది. ముఖ్యంగా జస్టిన్ గ్రీవ్.. భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. జైడెన్ సీల్స్‌ను బుమ్రా ఔట్ చేయడంతో వెస్టిండీస్ పోరాటం ముగిసింది.

## ఏయ్! త్వరగా ఔట్ అవ్వు!

**గ్రీవ్స్‌ను బెదిరించిన సిరాజ్**

వెస్టిండీస్ బ్యాటర్ జస్టిన్ గ్రీవ్స్‌ను టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ బెదిరించాడు. పరుగులు చేస్తే బాగుండదని హైదరాబాద్ స్టైల్‌లో దమ్కీ ఇచ్చాడు. వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో భారత బౌలర్లకు కొరకరాని కొయ్యగా జస్టిన్ గ్రీవ్స్ మారాడు. జైడెన్ సీల్స్‌తో కలిసి ఆఖరి వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. వెస్టిండీస్‌ను ఆలౌట్ చేసేందుకు టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చేసిన ప్రయత్నాలు ఏవి ఫలించ లేదు బౌలర్లు, ఫీల్డ్ సెట్ మార్చినా.. లాభం లేకపోయింది. ఈ క్రమంలోనే ఆఖరి సెషన్ ప్రారంభానికి ముందు జస్టిన్ గ్రీవ్స్ దగ్గరకు వెళ్లిన సిరాజ్.. బెదిరింపులకు పాల్పడ్డాడు. త్వరగా ఔటవ్వకపోతే బాగుండదని దమ్కీ ఇచ్చాడు. అతని బెదిరింపులకు జస్టిన్ గ్రీవ్స్ పడి పడి నవ్వాడు.

## గంభీర్ అనాలోచిత నిర్ణయం!



వెస్టిండీస్‌తో న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్‌లో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తప్పుడు నిర్ణయం తీసుకున్నాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో 248 పరుగులకు ఆలౌట్ అయిన వెస్టిండీస్‌ను ఫాలో ఆన్ ఆడించడం సరైన నిర్ణయం కాదని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తొలి ఇన్నింగ్స్ తరహాలో రెండో ఇన్నింగ్స్‌లోనూ విండీస్‌ను ఆలౌట్ చేసి ఇన్నింగ్స్ తేడాతో విజయం సాధించాలని గంభీర్ రచించిన వ్యూహం బెడిసి కొట్టింది.

## బంగ్లాకు మరో ఓటమి

**ఉత్కంఠ పోరులో సఫారీలు గెలుపు**




మహిళల ప్రపంచ కప్‌లో సరికొత్త సంచలనాలు చోటుచేసుకుంటున్నాయి. భారత్‌పై చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన సఫారీ బ్యాటర్ డీక్లెర్క్ (37 నాటౌట్) మరోసారి ఒత్తిడిలోనూ చెలరేగింది. చివరి ఓవర్ వరకూ విజయం దోబూచులాడిన పోరులో బంగ్లాదేశ్‌కు గుండెకోతను మిగిల్చుతూ సఫారీలను గెలిపించిందీ ఆల్‌రౌండర్. ఆఖరి ఓవర్లో 8 రన్స్ అవసరం కాగా.. ఫోరో, సిక్సర్‌తో దక్షిణాఫ్రికాకు మూడు వికెట్ల విజయాన్ని కట్టబెట్టిందీ ఫినిషర్. ఫామ్‌లో ఉన్న సఫారీ బ్యాటర్లను అద్భుతంగా నిలువరించిన బంగ్లా క్యాచ్‌లు వదిలేసే భారీ మూల్యం చెల్లించుకుంది. వరల్డ్ కప్‌లో మరో ఆఖరి ఓవర్ థ్రిల్లర్. కానీ, విజయం మాత్రం దక్షిణాఫ్రికాదే. వైజాగ్‌లో భారత జట్టుపై మెరుపు అర్ధ శతకం బాది సఫారీలను గెలిపించిన డీ క్లెర్క్ (37 నాటౌట్) ఈసారి బంగ్లాదేశ్‌ను గెలుపు వాకిట దెబ్బకొట్టింది. ఆరంభం నుంచి పక్కాగా బౌలింగ్ చేస్తూ .. వికెట్ల వేటతో దక్షిణాఫ్రికా బ్యాటర్ల దూకుడుకు కళ్లెం వేసిన బంగ్లా స్పిన్నర్లు.. ఆఖరి వరకూ గొప్పగా బౌలింగ్ చేశారు. కానీ, ఫీల్డర్లు ట్రయాన్, డీక్లెర్క్ క్యాచ్‌లు వదిలేయడం ఆ జట్టు కొంపముంచింది. మరినే కాప్ (56), చోలే ట్రయాన్(62)లు అర్ధ శతకాలతో రాణించారు. పటిష్టమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన దక్షిణాఫ్రికా స్వల్ప లక్ష్య ఛేదనలో అపసోపాలు పడింది. వైజాగ్‌లో బంగ్లాదేశ్ స్పిన్నర్లు విజృంభించడంతో పరుగుల కోసం చెమటోడ్చారు



## భారత మహిళలు సెమీస్ చేరాలంటే..

మహిళల వన్డే ప్రపంచకప్ 2025 టోర్నీలో టీమిండియాకు మరో ఓటమి ఎదురైంది. వైజాగ్ వేదికగా ఆదివారం జరిగిన హైస్కోరింగ్ గేమ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాతో 3 వికెట్ల తేడాతో టీమిండియాను ఓడించింది. లోయరార్డర్ వైఫల్యం.. చెత్త బౌలింగ్ టీమిండియా విజయవకాశాలను దెబ్బతీసింది. ఈ ఓటమితో టీమిండియా తమ సెమీస్ అవకాశాలను సంక్లిష్టంగా మార్చుకుంది. చివరి మూడు మ్యాచ్‌లకు మూడు గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2 విజయాలు 2 ఓటములతో పాయింట్స్ టేబుల్‌లో మూడో స్థానంలో కొనసాగుతున్న భారత్.. తదుపరి మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌తో తలపడనుంది. టోర్నీ ఫార్మాట్ ప్రకారం పాయింట్స్ టేబుల్‌లో టాప్-4లో ఉన్న జట్లే సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఈ క్రమంలో టీమిండియా సెమీఫైనల్ చేరాలంటే తమ తదుపరి మూడు మ్యాచ్‌లకు మూడు గెలవాలి. అప్పుడే ఏ జట్టుతో సంబంధం లేకుండా నేరుగా సెమీస్‌కు అర్హత సాధిస్తోంది. అలా కాకుండా ఒక్క మ్యాచ్ ఓడినా.. సెమీఫైనల్ సమీకరణాలు సంక్లిష్టంగా మారుతాయి. ఇతర జట్ల ఫలితాలు, నెట్‌రన్‌రేట్‌పై ఆధారపడాల్సి ఉంటుంది. ఆఖరి మూడు మ్యాచ్‌ల్లో రెండు ఓడితే మాత్రం సెమీస్ ఆశలు గల్లంతవుతాయి. మరో అవకాశం లేకుండా టీమిండియా ఇంటిబాట పడుతుంది. ఈ క్రమంలోనే కనీసం రెండు మ్యాచ్‌లు గెలవాలి. అయితే బంగ్లాదేశ్ మినహా రెండు జట్లు టీమిండియాకు కఠినమైనవే. ఆస్ట్రేలియాతో ఓటమి టీమిండియా ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. వీలైనంత త్వరగా ఈ మ్యాచ్‌ను మరిచిపోయి టీమిండియా తదుపరి మ్యాచ్‌కు సిద్ధం కావాలి. సమష్టిగా రాణిస్తేనే.. ఏ ఒక్కరి ప్రదర్శనపైన ఆధారపడకుండా సమష్టిగా రాణిస్తేనే టీమిండియాకు సెమీస్ బెర్త్ దక్కుతుంది. బ్యాటింగ్‌లో స్మృతి మంధాన, హర్లీన్ డియోల్, ప్రతికా రావల్, జెమీమా రోడ్రిగ్స్ ఫామ్‌లోకి రావడం టీమిండియాకు కలిసొచ్చే అంశం. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా బ్యాట్ ఝులిపిస్తే టీమిండియాకు తిరుగుండదు. లోయార్డర్‌లో రిచా ఘోష్ సూపర్ ఫామ్‌లో ఉండటం, స్నేహ్ రాణా రాణిస్తుండటం టీమిండియాకు కలిసొచ్చే అంశం. ఇతర ప్లేయర్లు కూడా బాధ్యతగా బ్యాటింగ్ చేస్తే భారత్ భారీ స్కోర్ నమోదు చేస్తోంది. గత రెండు మ్యాచ్‌ల్లో టీమిండియా బౌలింగ్ లుకలుకలు తెలిసొచ్చాయి. స్పిన్నర్లు మినహా పేసర్లు సత్తా చాటలేకపోతున్నారు. శ్రీ చరణి, దీప్తి శర్మ, స్నేహ్ రాణా పర్వాలేదనిపిస్తున్నా.. క్రాంతి గౌడ్, అమన్ జోత్ ధారళంగా పరుగులిస్తున్నారు. వీలైనంత త్వరగా బౌలింగ్ వైఫల్యాన్ని అధిగమిస్తేనే భారత్ సెమీస్ చేరగలదు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఆస్ట్రేలియా మహిళల జట్టు, కేవలం 49 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 331 పరుగులు చేసింది. దీంతో మహిళల వన్డే క్రికెట్‌లో ఆస్ట్రేలియా అత్యధిక పరుగుల ఛేదన రికార్డును నెలకొల్పింది. ప్రపంచకప్‌లో భారత్‌కు ఇది వరుసగా రెండో ఓటమి. ఈ పరాజయంతో టీమ్ ఇండియాకు సెమీఫైనల్ చేరుకునే మార్గం మరింత కష్టంగా మారినట్లు కనిపిస్తోంది. మొత్తం మీద క్యాంప్‌బెల్ సెంచరీ, హెూప్ మద్దతుతో వెస్టిండీస్ జట్టు టెస్ట్ మ్యాచ్‌లో పోరాడుతున్నప్పటికీ, భారత్ ఇప్పటికీ మ్యాచ్‌పై బలమైన పట్టు సాధించి ఉంది. అయితే క్యాంప్‌బెల్ ప్రదర్శన కరేబియన్ జట్టులో కొత్త ఆశలను రేకెత్తించింది.




### బీహార్ వైస్ కెప్టెన్‌గా

## వైభవ్ సూర్యవంశీ

ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ప్లేట్ లీగ్ సీజన్‌లో బీహార్ జట్టు తమ తొలి మ్యాచ్‌లో అరుణాచల్‌ప్రదేశ్‌ను ఢీకొట్టనున్నది. ఈ లీగ్‌కు బీహార్ క్రికెట్ అసోసియేషన్ జట్టును ప్రకటించింది. బుధవారం నుంచి ప్రారంభంకానున్న రాబోయే రంజీ ట్రోఫీ సీజన్‌లో తొలి రెండు మ్యాచులకు యువ బ్యాట్స్‌మెన్, 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. సకిబుల్ గని కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. 15న మొయిన్-ఉల్-హక్ స్టేడియంలో జరిగే ప్లేట్ లీగ్ సీజన్‌లో బీహార్ తన తొలి మ్యాచ్‌లో అరుణాచల్ ప్రదేశ్‌తో తలపడనున్నది. అయితే, గత రంజీ ట్రోఫీ సీజన్‌లో ఒక్క విజయం కూడా నమోదు చేయకపోవడంతో బీహార్ను ప్లేట్ లీగ్ దశకు కుదించారు. సూర్యవంశీ 2023-24 సీజన్‌లో 12 సంవత్సరాల వయసులో రంజీ ట్రోఫీలో అరంగేట్రం చేశాడు. ఆ తర్వాత ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) కాంట్రాక్ట్ పొందిన అతి పిన్న వయస్కుడిగా (13 ఏళ్లు) నిలిచాడు. భారత అండర్-19 జట్టుతో ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలో కూడా పర్యటించాడు. ఐపీఎల్ కోసం రాజస్థాన్ రాయల్స్ సూర్యవంశీని ఎంపిక చేసింది. గుజరాత్ టైటాన్స్‌పై టీ20లో సెంచరీ చేసిన అతి పిన్న వయస్కుడిగా (14) ఈ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. కేవలం 35 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఇది ఐపీఎల్‌లో రెండో వేగవంతమైన సెంచరీ కూడా. వచ్చే ఏడాది ప్రారంభంలో జింబాబ్వే, నమీబియాలో జరగనున్న అండర్-19 ప్రపంచ కప్ కోసం భారత జట్టులో స్థానం కోసం సూర్యవంశీ పోటీ పడుతున్నాడు.

ఈవార్తలు ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
మంగళవారం 14-10-2025 | www.evarthalu.com



# సంగీతంలో రారాజు.. త్యాగరాజు

త్యాగయ్య, త్యాగబ్రహ్మ, త్యాగరాజు అనే పేర్లతో కూడా ప్రసిద్ధుడు. నాదోపాసన ద్వారా భగవంతుని తెలుసుకోవచ్చని నిరూపించిన వాగ్గేయకారుడు. ఆయన కీర్తనలు శ్రీరామునిపై అతనికి గల విశేష భక్తిని, వేదాలపై, ఉపనిషత్తులపై అతనుకున్న జ్ఞానాన్ని తెలియపరుస్తాయి. ఉపనయనం తరువాత తండ్రిగారి బోధనలచే, రామకృష్ణానంద పరబ్రహ్మం ఉపదేశం చేసిన మంత్ర ప్రభావం వల్ల పూర్తిగా భక్తి మార్గము లో వెళ్లారు. తమిళనాడు లో పుట్టి పెరిగినాకూడా, గేయాలన్ని ఎక్కువగా తెలుగు, సంస్కృతాల్లోనే ఉన్నాయి.



త్యాగరాజు 1767 మే 4 వ తేదీన ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో ఉన్న తంజావూరు జిల్లాకు దగ్గరలో ఉన్న తిరువారూర్ అనే గ్రామంలో జన్మించాడు. కాకర్ల రామబ్రహ్మం, సీతమ్మ దంపతుల మూడవ సంతానం.వీరు ములకనాడు తెలుగు బ్రాహ్మణులు, భరద్వాజ గోత్రీకులు, త్రిలింగ వైదికులు, ఆపస్తంభ సూత్రులు.త్యాగరాజు పూర్వీకులు ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా, కంభం మండలంలో కాకర్ల అను గ్రామం నుండి తంజావూరు పరిసర ప్రాంతానికి వలస వెళ్లారు. తండ్రి రామబ్రహ్మం తంజావూరు ప్రభువు శరభోజీ దగ్గర పని చేసేవారు. త్యాగరాజు తాత గిరిరాజ కవి మరియు తెలుగు వాగ్గేయకారుడు.ఇతని గురించి త్యాగయ్య తన బంగాళరాగ కృతిలో "గిరిరాజసుతా తనయ" అని తన తాతగార్ని స్తుతించారంటే ఎంతటి ప్రావీణ్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. త్యాగయ్య విద్య కొరకు తిరువారూర్ నుంచి తిరువయ్యూర్‌కు వెళ్ళారు. త్యాగయ్య అక్కడ సంస్కృతాన్ని, వేదవేదాంగాలను అభ్యసించారు.శొంఠి వేంకటరమణయ్య దగ్గర సంగీతం నేర్చుకుంటున్న సందర్భంలో త్యాగయ్య లో ఉన్న చాకచక్యంను, సంగీతంనందుగల ప్రావీణ్యతను గమనించి ప్రత్యేక శ్రద్ధతో,అన్నిరకాల సంగీత జ్ఞానాన్నీఅందిస్తూ, అతి శ్రద్ధతో సంగీతోపదేశం చేసారు. త్యాగయ్య తండ్రి చిన్న వయస్సులోనే మరణించినందున, అన్నదమ్ముల మధ్య జగిగిన భూపంపిణిలో త్యాగయ్య భాగంలో కులప్రతిమలైన శ్రీరామ లక్ష్మణులు విగ్రహాలు వచ్చాయి.ఆ ప్రతిమలను అతి భక్తితో పూజిస్తు అతి సామాన్యంగా జీవనం సాగించేవారు.ఏ కొంచెం ఖాళీ సమయం దొరికినా తన యిష్టదైవమైన "శ్రీరాముని" పై కృతులు రచించుటలో నిమగ్నమయ్యేవారు. త్యాగయ్య 96 కోట్ల శ్రీరామ నామాలు జపించి వారి దర్శనం పొంది, వారి ఆశీర్వాద పొందినట్లు కథనాలు.

18 సంవత్సరాల వయసులో త్యాగరాజుకు పార్వతి అనే యువతితో వివాహమైంది. కానీ వివాహమైన అయిదు సంవత్సరాల లోనే ఆమె మరణించడం వల్ల, తరువాత పార్వతి సోదరియైన కమలాంబను వివాహమాడారు.వీరికి సీతామహాలక్ష్మి అనే కూతురు జన్మించింది. ఆమె వివాహం తర్వాత కలిగినకుమారుడు కూడా మరణించడంతో త్యాగరాజుకు కచ్చితమైన వారసులెవరూ లేరు, కానీ అతను ఏర్పరచిన సాంప్రదాయం మాత్రం ఈనాటికీ కొనసాగుతూనే ఉంది. త్యాగరాజు తన సంగీత శిక్షణను శొంఠి వెంకటరమణయ్య దగ్గర, చాలా చిన్న వయసులోనే ప్రారంభించారు. పదమూడేండ్ల వయసులోనే త్యాగరాజు "నమో నమో రాఘవా" అనే కీర్తనను దేశికతోడి రాగంలో స్వరపరచారు.గురువు శొంఠి వేంకటరమణయ్య ఇంటిలో చేసిన కచేరీలో "ఎందరో మహానుభావులు" అనే కీర్తనను స్వరపరచి పాడారు. ఇది పంచరత్న కృతులలో ఐదవది. ఈ పాటకు వెంకటరమణయ్య చాలా సంతోషించి, త్యాగరాజులోని బాలమేధావిని గురించి, తంజావూరు రాజుకు చెప్పగా, రాజు సంతోషించి అనేక ధన కనక వస్తు వాహనాది రాజలాంఛనాలతో త్యాగరాజును సభకు ఆహ్వానించారు. కానీ త్యాగరాజు తనకు "నిధి కన్నా రామ సన్నిధే సుఖమని" ఆ కానుకలను తిరస్కరించారు.ఈ సందర్భంగా స్వరపరచి పాడినదే "నిధి చాల సుఖమా" అనే కీర్తన. సంగీతాన్ని భగవంతుని ప్రేమను పొందే మార్గంగా త్యాగరాజు భావించారు. సంగీతంలోని రాగ, తాళాలను వాటిపై తన ప్రావీణ్యాన్ని చూపించుకోవడానికి కాక, భగవంతుని నామాలను చెప్పడానికి, భగవంతుని లీలలను పొగడటానికి ఓ సాధనంగా మాత్రమే చూసారు.

తంజావూరు రాజు పంపిన కానుకలను తిరస్కరించినపుడు ఆగ్రహించిన అతని అన్నయ్య జపేశుడు, త్యాగరాజు నిత్యం పూజించుకునే శ్రీరామ పట్టాభిషేక విగ్రహాలను కావేరీ నదిలో విసిరివేసాడు. శ్రీరామ వియోగ బాధను తట్టుకోలేక, రాముడు లేని ఊరిలో ఉండలేక, దక్షిణ భారతదేశ యాత్రలకు వెళ్ళి అనేక దేవాలయాలను, తీర్థాలను దర్శించి, ఎన్నో అద్భుత కీర్తనలను త్యాగయ్య రచించారు. చివరగా శ్రీరాముని అనుగ్రహంతో విగ్రహాలను పొంది వైకుంఠ ఏకాదశి నాడు త్యాగరాజు శ్రీరామ సన్నిధిని చేరుకున్నారు. త్యాగయ్య "దివ్యనామ సంకీర్తనలు", "ఉత్సవ సాంప్రదాయ కీర్తనలు" అను బృంద కీర్తనలతొ పాటు "ప్రహ్లాద భక్త విజయం", "నౌకా చరిత్రం" అను సంగీత నాటకాలు కూడా రచించారు.త్యాగరాజు తన రామచంద్రుని పూజా విగ్రహాలు పోగొట్టు కున్నప్పుడు పాడిన పాటగా "ఎందు దాగినావో",తిరుపతి వేంకటేశ్వరుని దర్శనం కోసం వెళ్ళినప్పుడు అక్కడ తెరవేసి ఉంటే, "తెరతీయగరాదా" అనే పాట పాడితే తెరలు వేంకటేశ్వరుని దయచేత అవే తొలగి పోయాయని అంటారు. అసంఖ్యాకమైన కీర్తనలు రచించి, కర్ణాటక సంగీతంలోని అన్ని నియమాలను సోదాహరణంగా నిరూపించి శాశ్వతమైన కీర్తి సంపాదించిన త్యాగరాజును కర్ణాటక సంగీతానికి మూలస్తంభంగా చెపుతారు. ఇతను జన్మదినం రోజుని భారతీయ సంగీత దినోత్సవంగా జరుపుతారు. ఈ సంగీత నిధికి నివాళిగా ప్రతి సంవత్సరం పుష్య బహుళ పంచమి నాడు తిరువయ్యూరులో అతను సమాధి చెందిన త్యాగరాజ మహోత్సవ సభనందు త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తారు. వందలకొద్దీ కర్ణాటక సంగీత కళాకారులు అతను రచించిన పంచరత్న కృతులను కావేరీ నది ఒడ్డున గల అతని సమాధి వద్ద బృందగానం చేస్తారు. సంగీతాభిమానులకు ఈ గానం శ్రవణానందాన్ని కలిగించడమే కాకుండా భక్తిభావాన్ని కూడా రేకెత్తిస్తుంది. ఈ ఉత్సవాన్ని ప్రపంచంలో చాలాచోట్ల నిర్వహిస్తారు, కానీ తిరువయ్యూరులో నిర్వహించే ఆరాధన చాలా ప్రసిద్ధి గాంచింది. ప్రతీ సంవత్సరం పెరుగుతూ వస్తున్న కళాకారుల, సందర్శకుల కోసం ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు.

త్యాగరాజుకు మహాభక్తురాలైన బెంగుళూరు నాగరత్నమ్మ కావేరీ నది ఒడ్డున శిథిలావస్థలోనున్న స్వామి వారి సమాధి చూసి, ఆ స్థలాన్ని దాని చుట్టూ ఉన్న ప్రదేశాన్ని తంజావూరు రాజుల ద్వారా, రెవెన్యూ అధికారుల ద్వారా తన వశం చేసికొని పరిశుభ్రం చేయించి, గుడి, గోడలు కట్టించారు. మదరాసులోని తన ఇంటిని అమ్మి రాత్రనక పగలనక కష్టపడి  దేవాలయ నిర్మాణాన్ని ముగించారు. 1921 అక్టోబరు 27లో పునాదిరాయిని వేయగా, 1925 జనవరి 7న గుడి కుంభాభిషేకం జరిగింది. ఈ నిర్మాణాలకొరకు ఆమె సంపద, ఆభరణాలు అన్ని అమ్మ వలసి వచ్చింది. 1946లో త్యాగయ్య చిత్ర నిర్మాణము సందర్భంలో చిత్తూరు నాగయ్య నాగ రత్నమ్మగారిని కలిశారు.ఆమె కోరిక ప్రకారం  నాగయ్య "త్యాగరాజ నిలయం" అనే సత్రాన్ని కట్టించారు. 'రామేతి మధురం వాచం' అన్నట్లు 96 కోట్ల సార్లు రామనామాన్ని జపించి, స్వీయానుభవ భావనలే కృతి రూపంలో మలచి గాంధర్వగాన మధురానుభూతిగా లోకానికి అందించారు. భూలోక నారదుడైన త్యాగరాజ స్వామి నారద మంత్రోపదేశం పొంది, అనుగ్రహం ప్రాభవంతో 'స్వరార్ణవం' 'నారదీయం' అనే రెండు సంగీత రహస్యార్థ శాస్త్ర గ్రంథాలు రచించారు. పంచరత్న కృతి సందేశంలో శ్రీ త్యాగరాజస్వామి రచించిన కృతులను ప్రాపంచికం, తాత్వికం, కీర్తనం, నిత్యానుష్ఠానాలని వర్గీకరించవచ్చు. త్యాగరాజస్వామి కీర్తనలలో ఘనరాగ పంచరత్న కీర్తనలు ముఖ్యమైనవి. శ్రీ త్యాగరాజస్వామి రామభక్తామృతాన్ని సేవించి, కర్ణాటక సంగీత సంప్రదాయంలో అనేక కృతులను మధుర కీర్తనలుగా మలచి సంగీత, సాహిత్య రసజ్ఞుల హృదయాల్లో చిరంజీవిగా నిలిచారు. త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో విశేషంగా పంచరత్న కీర్తనలు ఆలపించడం సంప్రదాయంగా మారింది. త్యాగయ్య దాదాపు 800 కీర్తనలను రచించారు. వీటిలో చాలావరకు తెలుగులో కొన్ని మాత్రం సంస్కృతంలో రచించబడినవి. కానీ ఈ కీర్తనలు మాత్రం తెలుగు రాష్ట్రాలలో కంటే కర్ణాటక సంగీతంలో, తమిళనాట బాగా ప్రాచుర్యం పొందాయి. సంస్కృతంలో రచించబడిన జగదానందకారక అనే కీర్తన శ్రీరామునికున్న108 పేర్లను ప్రస్తావిస్తుంది. 'ప్రహ్లాద భక్తి విజయం', 'నౌకా చరితం' అనే నాట్యరూపకాలను కూడా రచించాడు. త్యాగయ్య క్షేత్రాలకు వెళ్ళినపుడు, ఆయా క్షేత్రం మీదను, క్షేత్రంలోని దేవుని మీదను కృతులు రచించారు. సంగీత సామ్రాజ్యములో ఒక గొప్ప చక్రవర్తి గా ఉన్న త్యాగరాజు గారు జనవరి 6,1847 న పరమపదించారు.



గడప రఘుపతిరావు
raghupatiraog@gmail.com
9963499282

ఈ రోజు ప్రత్యే'కథ'

# నాణ్యత, భద్రత, ప్రమాణాలు

(నేడు ప్రపంచ ప్రమాణాల దినోత్సవం)

ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబర్ 14న జరుపుకుంటారు. ఈ రోజు అంతర్జాతీయ ప్రమాణీకరణ సంస్థలైన ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్‌వో), ఇంటర్నేషనల్ ఎలక్ట్రోటెక్నికల్ కమిషన్ (ఐఈసీ), ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయూ) వంటి సంస్థల ఆధ్వర్యంలో జరుగుతుంది. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ప్రమాణీకరణ ప్రాముఖ్యతను గుర్తుచేయడానికి, దాని ప్రభావాన్ని విస్తరించడానికి ఉద్దేశించబడింది. 1970లో, అక్టోబర్ 14న మొదటిసారిగా ఈ రోజును జరుపుకున్నారు. ఈ రోజు ఐఎస్‌వో స్థాపన దినాన్ని సూచిస్తుంది. 1946లో ఈ సంస్థ ఏర్పాటైంది. 1946లో ఈ రోజునే లండన్‌లో ఐఎస్‌వో మొదటి సమావేశం జరిగింది, ఇది ప్రమాణీకరణ అంతర్జాతీయ సహకారానికి పునాది వేసింది.

- నాణ్యత, భద్రత: ప్రమాణాలు ఉత్పత్తులు, సేవల నాణ్యతను నిర్ధారిస్తాయి. ఉదాహరణకు, ఐఎస్‌వో 9001 నాణ్యత నిర్వహణ వ్యవస్థలకు సంబంధించిన ప్రమాణం.
- ఆహార భద్రత (ఐఎస్‌వో 22000), వైద్య పరికరాలు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులలో భద్రతా ప్రమాణాలు వినియోగదారుల ఆరోగ్యాన్ని కాపాడతాయి.
- అంతర్జాతీయ వాణిజ్యం: ప్రమాణీకరణ దేశాల మధ్య వాణిజ్యాన్ని సులభతరం చేస్తుంది. ఒకే రకమైన ప్రమాణాలు ఉండటం వల్ల ఉత్పత్తులు వివిధ దేశాలలో సులభంగా అమ్మబడతాయి.ఎలక్ట్రానిక్ పరికరాల కోసం ఐఈసీ ప్రమాణాలు అన్ని దేశాలలో ఒకే విధమైన సాంకేతిక అవసరాలను నిర్ధారిస్తాయి.
- సాంకేతిక ఆవిష్కరణ: ఏఐ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, 5జీ వంటి కొత్త సాంకేతికతలకు ప్రమాణాలు అవసరం. ఇవి భద్రత, అనుకూలత, సామర్థ్యాన్ని నిర్ధారిస్తాయి. 5జీ సాంకేతికతకు ఐటీయూ ప్రమాణాలు కీలకం.
- సుస్థిర అభివృద్ధి: పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రమాణాలు (ఐఎస్‌వో 14001) కంపెనీలు తమ కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి, సుస్థిర వనరులను ఉపయోగించడానికి సహాయపడతాయి.
- ఐక్యరాష్ట్ర సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ప్రమాణాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.
- వినియోగదారుల విశ్వాసం: ఐఎస్‌వో లేదా ఇతర ప్రమాణీకరణ గుర్తులు ఉన్న ఉత్పత్తులు వినియోగదారులకు నమ్మకాన్ని కలిగిస్తాయి. ఉదాహరణకు, సీఈ మార్క్ లేదా ఐఎస్ఐ మార్క్ ఉత్పత్తి భద్రతను సూచిస్తాయి.

## భారతదేశంలో ప్రమాణీకరణ

భారతదేశంలో, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) జాతీయ ప్రమాణీకరణ సంస్థగా పనిచేస్తుంది. బీఐఎస్ ద్వారా రూపొందించిన ఐఎస్ఐ మార్క్ ఉత్పత్తుల నాణ్యత, భద్రతకు గుర్తింపుగా ఉంటుంది. భారతదేశం ఐఎస్‌వో, ఐఈసీ సభ్యునిగా ఉండి, అంతర్జాతీయ ప్రమాణాలను అనుసరిస్తుంది. బీఐఎస్ ద్వారా గృహోపకరణాలు, ఆహార ఉత్పత్తులు,, నీటి సరఫరా వ్యవస్థలకు ప్రమాణాలు నిర్దేశించబడతాయి. భారతదేశంలో స్మార్ట్ సిటీలు, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిలో ప్రమాణీకరణ కీలకం.

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.